

# పల్లె వెలుగు

తెలుగు జాతీయ దిన పత్రిక

అవినీతిపై నిఘా

RNI-APTEL/2012/46499

GST No.37ACDFM5465G1Z1

No: KNL/3`78(D)/2026`2028

Published From : KURNOOL circulated at Nandyal,Srikakulam,VishakaPatanam,Vijayanagaram,East Godavari ,West Godavari, Krishna, Guntur,Prakasam, Nellore,Chittoor, Kurnool,Kadapa,Anantapuram, Hyderabad

ఎడిటర్ : ఎం. మహేష్ యాదవ్ | సంపుటి -14 | సంచిక - 253 | పేజీలు - 08 | వెల - 05/- | మంగళవారం 08-09-2026


## సభా నాయకుడిగా నేను మాటిస్తున్నా..

# 22ఏపై అసెంబ్లీలో చర్చిస్తం: సీఎం రేవంత్

హైదరాబాద్:

**అసెంబ్లీలో 22ఏ నిషేదిత భూముల జాబితాపై చర్చ జరపాలన్న బీజేపీ ఆందోళనపై సీఎం రేవంత్ రెడ్డి స్పందించారు. ఈ సందర్భంగా శాసన సభలో ఆయన మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యంలో చర్చల తర్వాతే నిర్ణయాలు ఉంటాయని.. చర్చలు జరగకుండా నిర్ణయాలు ఉండవని స్పష్టం చేశారు. చర్చలు లేకుండా విచారణ జరగకుండా బాధ్యులపై చర్యలు ఎలా తీసుకుంటామని ప్రశ్నించారు. నగరపర్యటనలను అన్వేషించండి. సభా నాయకుడిగా నేను మాటిస్తున్నా.. బీజేపీ లెవనెత్తిన 22ఏ నిషేధిత జాబితాపై సభలో చర్చ జరుగుతుందని స్పష్టం చేశారు. సభ్యులు శాసన సభా సంప్రదాయాలను కాపాడాలని హితవు పలికారు.**

ప్రతిపక్షాలు చెప్పాలనుకున్న విషయాలను బిజినెస్ అడ్వయిజరీ కమిటీ (బీఏసీ) మీటింగ్?లో చెప్పండని సూచించారు. అసెంబ్లీ ఎన్నిరోజులు కావాలంటే అన్ని రోజులు జరుపుతామని చెప్పారు.

బీఆర్ఎస్ ఎమ్మెల్సీ దళిత సమాజాన్ని అవమానించారు.. 22ఏ నిషేధిత జాబితాపై చర్చ జరిగితే బీఆర్ఎస్ తమ భూ అక్రమ దందాలు బయటపడతాయని భయంతో అసెంబ్లీ బయట డ్రామాలు ఆడుతోందని విమర్శించారు. తమ చీకటి మిత్రులను కాపాడేందుకు సభలో బీజేపీ ప్రయత్నిస్తోందని అన్నారు. కాగా, సోమవారం (సెప్టెంబర్ 7) తెలంగాణ వర్షాకాల సమావేశాలు ప్రారంభం కాగా.. రాష్ట్రంలో తీవ్ర దుమారం రేపుతోన్న 22ఏ నిషేధిత భూములు జాబితాపై చర్చకు బీజేపీ పట్టుబట్టడంతో అసెంబ్లీలో వాయిదా పడింది.








## బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధును డిస్మిస్ చేయాలి: సీఎం రేవంత్

స్పీకర్ గడ్డం ప్రసాద్ పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు చేసిన వ్యాఖ్యలపై సీఎం రేవంత్ ఆగ్రహం వ్యక్తం చేశారు. 2026 సెప్టెంబర్ 7న అసెంబ్లీలో మాట్లాడిన సీఎం రేవంత్.. తల్లిని అవమానిస్తే ఎవరైనా ఊరుకుంటారా..? అని అన్నారు. సభాపతిని అవమానిస్తే అది సభ్యులందిరినీ అవమానించినట్లేనని అన్నారు. సభాపతిపై జుగుప్సాకరంగా మాట్లాడిన ఎమ్మెల్సీని డిస్మిస్ చేయాలని శాసన మండలి ఛైర్మన్ కు విజ్ఞప్తి చేశారు.



## ఉద్యోగాల పేరుతో మోసం.. యూట్యూబర్ నందన అరెస్ట్

యూట్యూబర్ నందనను శంషాబాద్ ఎయిర్‌పోర్టు పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నందనపై లుక్‌అవుట్ నోటీసులు జారీ కావడంతో శంషాబాద్ ఎయిర్‌పోర్టులో తనను గుర్తించారు. ఎయిర్‌పోర్టులో ఆమెను అదుపులోకి తీసుకున్న అనంతరం ఇబ్రహీంపట్నం పోలీసులకు.. ఆర్‌జీఐఏ పోలీసులు అప్పగించారు. లండన్‌లో ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ భారీగా డబ్బులు వసూలు చేసినట్లు నందన దంపతులపై ఆరోపణలు వచ్చాయి. ఈ క్రమంలోనే పలువురు బాధితులు పోలీసులను ఆశ్రయించినట్లు సమాచారం. 2



## స్పీకర్‌పై తాతా మధు వ్యాఖ్యలు సరికాదు.. బీజేపీ ఎమ్మెల్యేలంతా ఖండిస్తున్నాం: ఏలేటి

అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌ను ఉద్దేశించి బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు చేసిన వ్యాఖ్యలపై బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి స్పందించారు. ఈరోజు (సోమవారం) శాసనసభలో మాట్లాడుతూ.. స్పీకర్‌పై ఎమ్మెల్సీ తాత మధు అలా మాట్లాడటం సరికాదన్నారు. మధు మాట్లాడిన భాషను బీజేపీ ఎమ్మెల్యేలమంతా ఖండిస్తున్నామని చెప్పారు. అపోజిషన్ లీడర్ కేసీఆర్ కూడా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు.

## అక్క చీర లాగితే తమ్ముడు ఊరుకుంటాడా: హరీశ్ రావు



2

తెలంగాణ అసెంబ్లీ గేటు వద్ద మాజీ మంత్రి సునీతా లక్ష్మారెడ్డి చీరను పోలీసులు లాగారంటూ బీఆర్ఎస్ ఆరోపణలు గుప్పిస్తోంది. ఈ అంశంపై మాజీ మంత్రి హరీశ్ రావు మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యంలో ఇది బ్లాక్ డే అని అన్నారు. చీర లాగి సునీతా లక్ష్మారెడ్డిని అవమానించారని మండిపడ్డారు.



2

## రాంచందర్ రావు అరెస్ట్.. తోపులాట.. ఉద్రిక్తత

తెలంగాణ అసెంబ్లీ ముట్టడికి యత్నించిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావును పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ క్రమంలో అక్కడ తీవ్ర ఉద్రికత చోటు చేసుకుంది. బీజేపీ శ్రేణులను పోలీసులు ఎప్పటికప్పుడు అరెస్ట్ చేస్తున్నారు.

## స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు.. ఎమ్మెల్సీపై చర్యలకు సిద్ధమవుతున్న మండలి చైర్మన్

తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాత మధు అనుచిత వ్యాఖ్యలు చేసినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో స్పీకర్‌పై మధు అనుచిత వ్యాఖ్యల వీడియోను సీఎంవో విడుదల చేసింది. తాతా మధుపై చర్యలకు శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి సిద్ధమవుతున్నట్లు సమాచారం. ప్రస్తుతం ఖమ్మం స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా తాతా మధు కొనసాగుతున్న విషయం తెలిసిందే. 2



## నేను స్పీకర్‌ని ఏమీ అనలేదు: తాతా మధు

ఇంటర్నెట్ డెస్క్



తెలంగాణ అసెంబ్లీ గేటు వద్ద బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు (తాతా మధుసూదన్) పోలీసులతో, అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌ను ఉద్దేశించి అనుచిత వ్యాఖ్యలు చేసినట్లు సమాచారం. ఈ వ్యాఖ్యలపై తాతా మధు క్లారిటీ ఇచ్చారు. తాను స్పీకర్‌ను ఏం అనలేదని.. కావాలని తనపై దుష్ప్రచారం చేశారని స్పష్టం చేశారు. తాను స్పీకర్ చైర్‌ను ఎంతో గౌరవిస్తానని తాతా మధు వ్యాఖ్యానించారు.



2

## కేసీఆర్ పాదయాత్ర చేస్తే ప్రజలు నవ్వుతారు: మంత్రి ఉత్తమ్

మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్ రావుపై తెలంగాణ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. కేసీఆర్ పాదయాత్ర చేస్తే ప్రజలు నవ్వుతారని సెటైర్లు గుప్పించారు. కూలిపోయిన కాళేశ్వరం దగ్గరకు సిగ్గు లేకుండా ఎలా పోతారు.? అని ప్రశ్నించారు. ఈరోజు (సోమవారం) అసెంబ్లీ మీడియా హాల్లో మంత్రి ఉత్తమ్ చిట్‌చాట్ చేశారు. నీళ్ల సమస్యకు రెండే కారణాలు ఉన్నాయని తెలిపారు. కేసీఆర్, ఎల్‌నినో రెండు కారణాలతోనే నీళ్ల సమస్యలు వచ్చాయని పేర్కొన్నారు.

# ప్రజలపై ధరల భారాన్ని మోపుతున్న పాలకుల విధానాలకు వ్యతిరేకంగా సెప్టెంబర్ 9న జిల్లా వ్యాప్త ఆందోళలను. జయప్రదం చేయండి. సిపిఐ.

పల్లె వెలుగు నంద్యాల రూరల్ దేశంలో 2014



నుంచి 2026 వరకు నిత్యావసర వస్తువుల ధరలు సామాన్య ప్రజలపై పెనుభారంగా మారాయి. బియ్యం, కందిపప్పు, మినప్పప్పు, పెసరపప్పు, శనగపప్పు వంటి పప్పుధాన్యాల ధరలు పెరిగాయి. వంటనూనె, పాలు, చక్కెర, ఉప్పు ధరలు కూడా పెరిగాయి. ఉల్లి, టమాటా, బంగాళాదుంప, వంకాయ వంటి కూరగాయల ధరలు తరచూ సామాన్యుడి అందుబాటును దాటుతున్నాయని పెరుగుతున్న ధరలకు వ్యతిరేకంగా జిల్లా వ్యాప్తంగా సెప్టెంబర్ 9వ తేదీ జరుగు ఆందోళనను సిపిఐ శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎన్. రంగనాయుడు పిలుపునిచ్చారు

దేశ రాష్ట్ర జిల్లా వ్యాప్తంగా పప్పులు, నూనెలు, నిత్యావసరాల ధరల దోపిడీకందిపప్పు, మినప్పప్పు, పెసరపప్పు, శనగపప్పు వంటి ప్రోటీన్ ఆహార పదార్థాలు సామాన్య కుటుంబాల భోజనంలో రోజురోజుకూ తగ్గుతున్నాయని వంటనూనెల ధరల పెరుగుదల ప్రతి కుటుంబం నెలవారీ బడ్జెట్‌ను తీవ్రంగా దెబ్బతీస్తోందని పాలు, చక్కెర, ఉప్పు వంటి రోజువారీ అవసరాల ధరలు కూడా కుటుంబ ఖర్చులను పెంచుతున్నాయని అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ

జిల్లాలో కూరగాయల ధరలు -- ప్రతిరోజూ కొత్త భారం ఉల్లి, టమాటా, బంగాళాదుంప, వంకాయ వంటి కూరగాయల ధరలు ఎప్పుడు పెరుగుతాయో, ఎప్పుడు తగ్గుతాయో సామాన్యుడికి అర్థంకాని పరిస్థితి ఏర్పడింది. రైతు పొలంలో తక్కువ ధర, వినియోగదారుడి మార్కెట్‌లో ఎక్కువ ధర ఉండటానికి ప్రధాన కారణం మధ్యవర్తులు, దళారీలు, నిల్వదారుల దోపిడీ అని రైతు నష్టపోతున్నాడు -- వినియోగదారుడు నష్టపోతున్నాడని -- దళారీ మాత్రం లాభపడుతున్నాడని

2014 ఏప్రిల్‌లో ఢిల్లీలో పెట్రోల్ ధర లీటరుకు ?72.26, డీజిల్ ?55.49 ఉండగా, 2026 సెప్టెంబర్‌లో ఢిల్లీలో పెట్రోల్ ?102.12, డీజిల్ ?95.20గా ఉన్నాయని అధికారిక గణాంకాలు వెల్లడిస్తున్నాయని వంటగ్యాస్ ధరలు కూడా పేద, మధ్యతరగతి కుటుంబాలపై తీవ్ర ఆర్థిక భారాన్ని మోపుతున్నాయి. ప్రతి కుటుంబానికి అందుబాటులో ఉండే ధరకు వంటగ్యాస్ అందించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉంది. గ్యాస్ ధరలను తగ్గించి సామాన్య కుటుంబాలపై భారాన్ని తగ్గించాలని నల్లబజారు, అక్రమ నిల్వలు, దళారీ వ్యవస్థను అరికట్టాలనిప్రజలపై ధరల భారాన్ని మోపే విధానాలను ప్రతిఘటిస్తూ, ధరల దోపిడీకి వ్యతిరేకంగా ప్రజలను విస్తృతంగా సమీకరించాలి. సెప్టెంబర్ 9న రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించే ఆందోళనలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

# కలెక్టర్ ఆదేశాలతో

## తెలుగు గంగ కాలువకు 1000 క్యూసెక్కుల నీరు విడుదల


బండి ఆత్మకూరు పల్లె వెలుగు సెప్టెంబర్ 7: నంద్యాల జిల్లా కలెక్టర్ రాజకుమారి గనియ



ఆదేశాల మేరకు వెలుగోడు రిజర్వాయర్ నుండి తెలుగు గంగ ప్రధాన కాలువకు సోమవారం మధ్యాహ్నం 1000 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ప్రజల తాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకొని అధికారులు ఈ నిర్ణయం తీసుకున్నారు. మధ్యాహ్నం జలమండలి శాఖ ఎస్ ఇ, శంకర రెడ్డి, డీఈఈ వెంకటేశ్వర్లు, ఏఈలు ఉదయ్ కుమార్ రెడ్డి, రఘు రాముడు వెలుగోడు రిజర్వాయర్ వద్ద పూజలు నిర్వహించారు. అనంతరం రిజర్వాయర్ ద్వారా ప్రధాన కాలువకు 1000 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. నీటిని విడుదల చేసేముందు శ్రీశైలం, ఆళ్ల గడ్డ ఎమ్మెల్యేలు, బుడ్డా రాజశేఖర్ రెడ్డి, అఖిల ప్రియకు తెలుగు గంగ అధికారులు సమాచారం అందించారు. వారి సూచనల మేరకు తెలుగు గంగ రిజర్వాయర్ ద్వారా ప్రధాన కాలువకు నీటిని విడుదల చేశారు. ప్రధాన కాలువకు నీటిని విడుదల చేసేముందు నంద్యాల జిల్లాలోని 37 బ్లాకులను అధికారులు మూసివేశారు. 63వ కిలోమీటర్ వద్ద ఉన్న గండ్లేరు రిజర్వాయర్







నీటితో నింపడం జరుగుతుందని తద్వారా ఆళ్ల గడ్డ ప్రజలకు తాగునీరు అందే సౌకర్యం ఏర్పడుతుందని ఎస్ ఇ శంకర్ రెడ్డి పేర్కొన్నారు. తర్వాత చెరువులన్నింటినీ ప్రజల తాగునీటి అవసరాల కొరకు నింపడం జరుగుతుందని ఆయన తెలిపారు. గత 60 రోజుల కాలం నుండి ఎల్నినో ప్రభావం కారణంగా వర్షాభావ పరిస్థితులు ఏర్పడ్డాయి. ఈ కారణంగా బోర్లలో కూడా భూగర్భ జలాలు ఇంకిపోవడంతో, తాగునీటికి ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి ఏర్పడింది. ప్రస్తుతం రిజర్వాయర్ నుండి తెలుగుగంగ ప్రధాన కాలువకు నీరు విడుదల చేయడం వల్ల బోర్లు రీఛార్జి అయ్యే అవకాశం ఉంది. తెలుగు గంగ ప్రధాన కాలువకు సాగునీటిని విడుదల చేయడంలో నంద్యాల జిల్లాలోని ఇరువురు మంత్రులతో పాటు, జిల్లా ఎమ్మెల్యేలు చొరవ చూపారు. రాష్ట్రంలో ఎల్లీనో ప్రభావం కారణంగా వర్షాభావ పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో నంద్యాల జిల్లా ప్రజలు తా గునీటి సమస్యను ఎదుర్కొంటున్నారని, ఈ విషయంలో తక్షణ చర్యలు చేపట్టాలని, నంద్యాల జిల్లా ఇన్చార్జి మంత్రి పయ్యావుల కేశవ్, మైనార్టీ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్, రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి, జిల్లా ఎమ్మెల్యేలు బుడ్డా రాజశేఖర్ రెడ్డి, కోట్ల జయ సూర్య ప్రకాశ్ రెడ్డి, గౌరు చరితారెడ్డి, గిత్త జయసూర్య వారం రోజుల క్రితం నీటిపారుదల శాఖ మంత్రి డాక్టర్ నిర్మల రామానాయుడు కు విజ్ఞప్తి చేశారు. సకాలంలో వర్షాలు పర్యకపోవడం వల్ల అందుబాటులో ఉన్న నీటి వనరులను వినియోగించి అవసరమైన నీటిని విడుదల చేయాలని విజయవాడలో మంత్రి నిమ్మలను కలిసి విజ్ఞప్తి చేయడం జరిగింది. ఈ విషయంపై నిమ్మల సానుకూలంగా స్పందించారు. మంత్రులు, జిల్లా ఎమ్మెల్యేలు చేసిన విజ్ఞప్తి మేరకు, వెలుగోడు రిజర్వాయర్ నుండి తెలుగు గంగ ప్రధాన కాలువకు 1000 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. నీటిని విడుదల చేయించడంలో చొరవ చూపిన మంత్రులకు ఎమ్మెల్యేలకు జిల్లాలోని రైతాంగం కృతజ్ఞతలు తెలియజేస్తూ ఉన్నారు. కర్నూలు కడప కాలువ తో పాటు, కుందూ నదికి నీటిని విడుదల చేయించడంలో ఎమ్మెల్యేలు చొరవ చూపారు. ఈనెల మూడవ తేదీన బానకచర్ల రెగ్యులేటర్ ద్వారా సంత జుటూరు పిక్ అప్ ఆనకట్ట నుండి 1000 క్యూసెక్కుల నీటిని కుందూ నదికి, కేసీ కాలువ కు నీటిని విడుదల చేయించారు. రైతాంగం సమస్యలను దృష్టిలో పెట్టుకొని తాగు నీటిని విడుదల చేయించడంలో చొరవ చూపిన శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి కి రైతులు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు.

# రైతులు విశిష్ట సంఖ్యపంట నమోదు తప్పనిసరి చేసుకోవాలి

### -మండలవ్యవసాయ అధికారిని ప్రమీల

దొర్నిపాడు సెప్టెంబర్ 7 పల్లె వెలుగు న్యూస్ మండలంలోని రైతు సోదరులు వారు



సాగుచేసిన పంటల వివరాల నమోదు తోపాటు విశిష్ట సంఖ్య తప్పనిసరిగా చేయించుకోవాలని దొర్నిపాడు మండల వ్యవసాయ అధికారి శ్రీమతి ప్రమీల అన్నారు ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు సాగు చేసిన పంటలు ఈ నెల 15 తేదీ ఆఖరి తేదీ కావునపంటనమోదుచేయించుకోవాలనితెలిపారు. అలాగే రైతు విశిష్ట సంఖ్య కలిగిన రైతులు మాత్రమే ప్రభుత్వం ఏర్పాటు చేసే కొనుగోలు కేంద్రాల ద్వారా వారు పండించిన ధాన్యం అమ్ముకోగలరు కావున ఇంకా ఎవరైనా రైతులు రైతు విశిష్ట నమోదు సంఖ్య పొందక పోతే వెంటనే రైతు సేవ కేంద్రాలను సంప్రదించి రైతు విశిష్ట సంఖ్య పొందాలని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు

# లీడర్‌షిప్ కాన్‌క్లేవ్‌లో పాల్గొన్న గుడిసె ఆది కృష్ణమ్మ

ఆదోని (పల్లె వెలుగు): తెలుగుదేశం పార్టీ మంగళగిరి కేంద్ర కార్యాలయంలో నిర్వహిస్తున్న





రెండు రోజుల లీడర్‌షిప్ కాన్‌క్లేవ్ శిక్షణ కార్యక్రమంలో కర్నూలు జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షురాలు శ్రీమతి గుడిసె ఆది కృష్ణమ్మ పాల్గొన్నారు. పార్టీ నాయకత్వాన్ని మరింత పటిష్టం చేయడం, నాయకులు, కార్యకర్తల్లో నాయకత్వ లక్షణాలను పెంపొందించడం, పార్టీ సిద్ధాంతాలు, విధానాలపై మరింత అవగాహన కల్పించడమే లక్ష్యంగా ఈ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. రెండు రోజుల పాటు జరిగే శిక్షణలో ప్రజలతో సమర్థవంతంగా మమేకం కావడం, ప్రజా సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేయడం, కార్యకర్తలతో సమన్వయం చేసుకోవడం, పార్టీ కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించడం వంటి అంశాలపై అవగాహన కల్పిస్తున్నారు. అలాగే క్షేత్రస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు అనుసరించాల్సిన కార్యాచరణ, నాయకత్వ సామర్థ్యాలను మెరుగుపరుచుకునే విధానాలు, కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ పార్టీ కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లే అంశాలపై శిక్షణ ఇస్తున్నారు. ప్రస్తుత రాజకీయ పరిస్థితుల్లో నాయకులు ప్రజలకు మరింత చేరువగా ఉంటూ, పార్టీ విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు, కార్యకర్తలకు మార్గనిర్దేశం చేయాల్సిన అవసరాన్ని ఈ సందర్భంగా వివరించారు. లీడర్‌షిప్ కాన్‌క్లేవ్ ద్వారా నాయకులు, కార్యకర్తల్లో నాయకత్వ పటిమను పెంపొందించి, పార్టీని గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు మరింత బలోపేతం చేయడమే ప్రధాన ఉద్దేశ్యమని పార్టీ వర్గాలు పేర్కొన్నాయి. ఈ శిక్షణ కార్యక్రమంలో గుడిసె ఆది కృష్ణమ్మ పాల్గొని పార్టీ నాయకత్వం, సంస్థాగత బలోపేతం తదితర అంశాలపై అవగాహన పొందారు. ఈ శిక్షణ కర్నూలు జిల్లాలో పార్టీ కార్యక్రమాలను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు ఉపయోగపడుతుందని పార్టీ శ్రేణులు ఆశాభావం వ్యక్తం చేశాయి.

## పోలీస్ "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" కార్యక్రమానికి 110 ఫిర్యాదులు.

### జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్ ఐపీఎస్.


పల్లె వెలుగు నంద్యాల క్రైమ్. నంద్యాల జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం ( 07-09-2026) నిర్వహించిన "ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెసల్ సిస్టం) కార్యక్రమంలో నంద్యాల జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్ ఐపీఎస్ ఫిర్యాదిదారుల నుంచి 110 ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులతో జిల్లా ఎస్పీ స్వయంగా మాట్లాడి ఫిర్యాదులపై పూర్తిస్థాయి విచారణ జరిపి పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు.

చట్ట పరిధిలో చట్టపరంగా ఉన్న సమస్యలకు తక్షణమే పరిష్కారం చూపాలని,నిర్ణీత గడువు లోపల ఫిర్యాదులను పరిష్కరించాలని, ఫిర్యాదులు పునరావృతం కాకుండా చూడాలని,ఫిర్యాదుల పట్ల అలసత్వం వ్యవహరించరాదని సంబంధిత అధికారులను ఆదేశించారు. పరిష్కరించిన ఫిర్యాదుల వివరాలను జిల్లా ప్రధాన కార్యాలయానికి అందజేయాలన్నారు.



# 9న నంద్యాలలో ఏపీ మీడియా ఫెడరేషన్ సమావేశం

బండి ఆత్మకూరు పల్లె వెలుగు సెప్టెంబర్ 7: ఈనెల 9న నంద్యాలలో ఆంధ్రప్రదేశ్ మీడియా ఫెడరేషన్ వ్యవస్థాపకులు ఢిల్లీ బాబు రెడ్డి సహకారంతో జర్నలిస్టుల సమావేశాన్ని నిర్వహించనున్నట్లు నంద్యాల జిల్లా మీడియా ఫెడరేషన్ కన్వీనర్ పిట్టం నాగవర్ధన్ రెడ్డి పేర్కొన్నారు. నంద్యాలలోని రామకృష్ణ పి జి కళాశాలలో జర్నలిస్టుల సమావేశాన్ని నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. నవ్యాంధ్రప్రదేశ్ నిర్మాణంలో భాగంగా కొత్త రాష్ట్రంలో అనేక రకాలైన సవాలను ఎదుర్కొంటున్న ప్రజలతోపాటు,ఆంధ్రప్రదేశ్ మీడియా ఫెడరేషన్ సభ్యులు కూడా భాగస్వాములు అవుతున్నారని పేర్కొన్నారు. కొన్ని జర్నలిస్టు సంఘాలు రాష్ట్రంలో ఉన్నప్పటికీ అవి ఉమ్మడి రాష్ట్రాల్లోనే పనిచేస్తున్నాయని అన్నారు. వారి ఆశయాలు కార్యక్రమాలు పద్ధతులు పాత రీతిలోనే ఉన్నాయని అన్నారు. రాష్ట్ర విభజన తర్వాత పని ప్రారంభించి కొత్త రిజిస్ట్రేషన్ లతో ఆంధ్ర ప్రదేశ్ లో మీడియా ఫెడరేషన్ పనిచేస్తుందని అన్నారు. ప్రత్యేక రీతిలో పోరాట ప్రతిమను పెంపొందించుకొని కేవలం రాష్ట్రంలో ఉన్న జర్నలిస్టుల సంక్షేమం కొరకు మాత్రమే ఆవిర్భవించిందని అన్నారు. ప్రభుత్వం ఇస్తున్న రాయితీల కోసం ఈ వృత్తిలో పనిచేస్తున్న వారిని బేషరతుగా తిరస్కరిస్తామని అన్నారు. జర్నలిస్టు వృత్తికి అంకితమై పని చేసే వారిని వృత్తిపై ఆధారపడి పనిచేస్తున్న జర్నలిస్టు మిత్రులకు అండగా నిలిచి ఇతర రాష్ట్రాలలోని వారికి అమలవుతున్న సంక్షేమ పథకాలను వృత్తి సంబంధమైన అంశాలపై వారికి అవగాహన కల్పించి వాటి సాధనకు మీడియా ఫెడరేషన్ పోరాటం సాగిస్తుందని అన్నారు. జిల్లాలో జర్నలిస్టు సోదరులకు సమస్యలు ఏర్పడిన తరుణంలో వాటిని పరిష్కరించేందుకు జిల్లా అడ్ హాక్ కమిటీ ప్రత్యేకంగా పనిచేస్తుందని అన్నారు. ఈ బాటలో ప్రయత్నాలలో కార్యక్రమాలలో అందరి



సహకారం ఆశిస్తూ కొత్త పంథాలో ముందుకు సాగేందుకు జర్నలిస్టు మిత్రులు చేయూతనివ్వాలని జిల్లా ఆహ్వాన కమిటీ సభ్యులు నాగ వర్ధనరెడ్డి,శివకుమార్ రెడ్డి, ఎం శ్రీనివాసులు విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశానికి మైనార్టీ శాఖ మంత్రి ఫరూక్, రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి,నంద్యాల పార్లమెంటు సభ్యురాలు డాక్టర్ శబరి,ఎమ్మెల్యేలు బుడ్డా రాజశేఖర్ రెడ్డి,అఖిలప్రియ, గౌరు చరితారెడ్డి , జిల్లా కలెక్టర్ రాజకుమారి గనియ, జిల్లా ఎస్పీ సునీల్ షోరాన్, నంద్యాల బిజెపి జిల్లా అధ్యక్షుడు అభిరుచి మధు, జిల్లా టిడిపి ప్రధాన కార్యదర్శి ఫిరోజ్, శాంతిరాం విద్యాసంస్థల చైర్మన్ శాంతి రాముడు, రామకృష్ణ విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ జి రామకృష్ణారెడ్డి, తోపాటు జిల్లాలోని మాజీ ఎమ్మెల్యేల తోపాటు, కర్నూలు అనంతపురం నెల్లూరు జిల్లాలకు చెందిన మీడియా ఫెడరేషన్ ప్రతినిధులతో పాటు, జిల్లాలోని మీడియా ఫెడరేషన్ ప్రతినిధులు అందరూ హాజరవుతారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి జిల్లాలోని జర్నలిస్టు మిత్రులందరూ పాల్గొని జయప్రదం చేయాలని నంద్యాల జిల్లా మీడియా ఫెడరేషన్ ఆహ్వాన కమిటీ విజ్ఞప్తి చేసింది.

## శ్రీ అంబాభవాని దేవాలయంలో ప్రత్యేక పూజలు.

ఆదోని (పల్లె వెలుగు): శ్రీ రుక్మిణి పాండురంగ విఠల్ నవమ ద్వాదశ వర్షీయ అఖండ నామ దిండి భజన మహా సప్తాహ మహోత్సవాల్లో భాగంగా అంబాభవాని దేవాలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో టీడీపీ సీనియర్ నాయకులు ఉమాపతి నాయుడు, వరల్డ్ సాలి ఫౌండేషన్ అధ్యక్షులు విజయ్ వక్తే పాల్గొన్నారు. ఆలయ పెద్దల ఆహ్వానం మేరకు సకారే మారుతి ఆధ్వర్యంలో దేవాలయానికి చేరుకున్న ఉమాపతి నాయుడు, విజయ్ వక్తేలకు ఆలయ నిర్వాహకులు, స్వకుల సాలి సమాజ పెద్దలు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం వారు అమ్మవారి సన్నిధిలో ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొని ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా ఉమాపతి నాయుడు మాట్లాడుతూ ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు ప్రజల్లో భక్తిభావాన్ని పెంపొందించడంతో పాటు సమాజంలో ఐక్యత, సోదరభావం, ఆధ్యాత్మిక చైతన్యాన్ని పెంపొందించేందుకు దోహదపడతాయని అన్నారు. భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్న మహా సప్తాహ భజన కార్యక్రమం విజయవంతంగా కొనసాగాలని, శ్రీ అంబాభవాని అమ్మవారి ఆశీస్సులు ప్రతి ఒక్కరిపై ఉండాలని ఆకాంక్షించారు. అఖండ నామ దిండి భజన మహా సప్తాహ కార్యక్రమం సందర్భంగా ఆలయంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్న ఈ ఆధ్యాత్మిక కార్యక్రమం ద్వారా సమాజంలో ఐక్యత, పరస్పర సోదరభావం మరింత బలపడాలని పలువురు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వరల్డ్ సాలి ఫౌండేషన్ నాయకులు, టీడీపీ నాయకులు కమలే గర్మాజీ, ఈరన్న, సకారే గోపాల్, పీసాయ్ మహిపాల్, సకారే తాయప్ప సార్, సకారే ఈరన్న, సకారే లక్ష్మణ్, సకారే నాగరాజ్, కమలే దత్త, కమలే దశరథ్, రాసాలే రామలింగ తదితరులతో పాటు స్వకుల సాలి మహిళలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమానికి హాజరై పూజల్లో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ ఆలయ నిర్వాహకులు, స్వకుల సాలి సమాజ పెద్దలు కృతజ్ఞతలు తెలిపారు.



## లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే జైలుకే ఆర్డీవో విశ్వనాథ్ .




పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. నంద్యాలలోని ఆర్డిఓ కార్యాలయం పిసిపిఎన్డిటి కమిటీ మీటింగు ఆర్డీవో విశ్వనాధ్ ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది .
ఈ సందర్భంగా ఆర్డిఓ విశ్వనాధ్ మాట్లాడుతూ ప్రైవేటు ఆసుపత్రులు స్కానింగ్ కేంద్రాలలో లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే నిర్వాహకుల లైసెన్సులు రద్దు చేయడంతో పాటు జైలు శిక్ష తప్పదని హెచ్చరించారు. చట్ట ప్రకారం లింగ నిర్ధారణ పరీక్షలు చేయడం ప్రోత్సహించడం నేరమన్నారు. సమాజానికి ప్రస్తుత పరిస్థితుల్లో ఆడబిడ్డ ముఖ్యమని ఆడబిడ్డను రక్షించే బాధ్యత సమాజంలోని ప్రతి పౌరునికి ఉందని తెలియజేశారు. స్కానింగ్ సెంటర్లలో ధరల బోర్డులు ప్రదర్శించాలని సూచించారు . ఈ కార్యక్రమంలో కమిటీ మెంబర్లైన డాక్టర్ శ్రవణ్ కుమార్ రేడియాలజిస్ట్, డాక్టర్ కె ఎస్ పి శ్రీనివాసులు డిపిఎమ్ఓ , జిల్లా ఎక్స్టెన్షన్ అండ్ మాస్ మీడియా అధికారి మల్లేపల్లి పామన్న, డాక్టర్ గింజుపల్లి అనూష గైనకాలజిస్ట్, లలిత కుమారి రేడియాలజిస్ట్. నంద్యాల బర్డ్ ఎన్జీవోప్రతినిధి వినయ్ బాబు, వంశీ పాల్గొన్నారు.

## బేతంచెర్లలో ఓటర్ల తుది జాబితా విడుదల

### ఎంపీడీవో ఎం. ఫజల్ రహిమాన్.

పల్లెవెలుగు బేతంచెర్ల, సెప్టెంబర్ 06: మండల పరిధిలో ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను




నిబంధనల ప్రకారం పూర్తి చేసి తుది జాబితాను అధికారులు ప్రకటించారు. ఎంపీడీవో ఎం. ఫజల్ రెహ్మాన్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. గ్రామాల వారీగా ఓటర్ల వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి, వచ్చిన అభ్యంతరాలు, సూచనలను పరిగణనలోకి తీసుకొని మార్పులు, చేర్పులు, తొలగింపులు చేపట్టి తుది జాబితాను సిద్ధం చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ.. ఓటర్ల జాబితా పారదర్శకంగా, ఎలాంటి తప్పులు లేకుండా ఉండేలా ప్రత్యేక దృష్టి సారించామని అన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓసీ వర్గాల వారీగా వివరాలను పరిశీలించి జాబితాను గ్రామ పంచాయతీలలో అందుబాటులో ఉంచామని, ప్రజలు తమ వివరాలను సరిచూసుకోవచ్చని తెలిపారు.
ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు కీలకమని, అర్హులైన ప్రతి ఒక్కరూ బాధ్యతగా ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో బి. మల్లికార్జున, పంచాయతీ అధికారులు పాల్గొన్నారు.
అన్న క్యాంటీన్ల తనిఖీ.

## శానిటేషన్ పనులపై కమిషనర్ శేషన్న ప్రత్యేక దృష్టి.



పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. పట్టణంలో పారిశుధ్య నిర్వహణ, అన్న క్యాంటీన్ల పనితీరుపై మున్సిపల్ అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. సోమవారం మున్సిపల్ కమిషనర్ బి. శేషన్న పట్టణంలోని అన్న క్యాంటీన్లను తనిఖీ చేసి, అక్కడి నిర్వహణ, పారిశుధ్య పరిస్థితులను పరిశీలించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా క్యాంటీన్లలో పరిశుభ్రత, నిర్వహణ ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని సిబ్బందికి సూచించారు.
అనంతరం పట్టణంలోని పలు ప్రాంతాల్లో కొనసాగుతున్న శానిటేషన్ పనులను కమిషనర్ పరిశీలించారు. పారిశుధ్య పనులు నిరంతరం కొనసాగించాలని, చెత్త పేరుకుపోకుండా ఎప్పటికప్పుడు తొలగించాలని సిబ్బందిని ఆదేశించారు. ప్రజారోగ్యానికి ఇబ్బంది కలిగించే పరిస్థితులు తలెత్తకుండా అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ పెంచాలని సూచించారు.
కమిషనర్ వెంట మున్సిపల్ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు విక్రమ్, శభరిష్, శానిటేషన్ సూపర్‌వైజర్లు లక్ష్మీనారాయణ, శివప్రసాద్‌రెడ్డి, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ధరల మంటతో సామాన్యుడి వంటిల్లు కుదేలు.

**● బ్లాక్‌మార్కెట్, దళారీ దోపిడీని అరికట్టి ధరల భారాన్ని తగ్గించాలి. ● సెప్టెంబర్ 9న రాష్ట్రవ్యాప్తంగా సీపీఐ నిరసనలు. ● సీపీఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య పిలుపు.**



పల్లె వెలుగు అమరావతి. ఆకాశాన్నంటుతున్న నిత్యావసర వస్తువుల ధరలతో పేదలు, కార్మికులు, రైతులు, ఉద్యోగులు, చిరు వ్యాపారులు, మధ్యతరగతి కుటుంబాల బతుకులు భారంగా మారాయని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య అన్నారు. ఒకవైపు ప్రజల ఆదాయాలు ఆశించిన స్థాయిలో పెరగకపోగా, మరోవైపు రోజురోజుకూ పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలు కుటుంబ బడ్జెట్లను ఛిద్రం చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కూరగాయలు కొనలేని పరిస్థితి, పప్పు వండాలంటే ఆలోచించాల్సిన పరిస్థితి, వంటనూనె వినియోగించాలంటే జేబు చూసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని, సామాన్యుడి వంటిల్లు నేడు అగ్నిగుండంగా మారిందని పేర్కొన్నారు.
2014తో పోలిస్తే నేడు నిత్యావసర వస్తువుల ధరలు భారీగా పెరిగినట్లు కేంద్ర ప్రభుత్వ అధికారిక గణాంకాలే వెల్లడిస్తున్నాయని ఈశ్వరయ్య తెలిపారు. బియ్యం కిలో ధర ?28.06 నుంచి ?45.69కు పెరిగిందని, అంటే సుమారు 63 శాతం పెరుగుదల నమోదైందన్నారు. కందిపప్పు ధర ?75.94 నుంచి ?122.06కు పెరిగి సుమారు 61 శాతం పెరిగిందని తెలిపారు. సన్‌ఫ్లవర్ వంటనూనె ధర ?93.55 నుంచి ?192.40కు పెరిగి 105 శాతం మేర పెరిగిందని, చక్కెర ధర ?34.02 నుంచి ?60.78కు పెరిగి సుమారు 79 శాతం, ఉల్లిపాయ ధర ?26.46 నుంచి ?50.19కు పెరిగి సుమారు 90 శాతం, టమాటా ధర ?21.44 నుంచి ?37.67కు పెరిగి సుమారు 76 శాతం పెరిగిందని వివరించారు.
ముఖ్యంగా వంటనూనె ధర రెట్టింపుకుపైగా పెరగడం, ఉల్లిపాయ ధర దాదాపు రెట్టింపు కావడం, బియ్యం, కందిపప్పు, చక్కెర, టమాటా ధరలు గణనీయంగా పెరగడం ప్రజలపై పడుతున్న ధరల భారానికి నిదర్శనమన్నారు. ధరలు ఇంత భారీగా పెరుగుతుంటే ప్రజల ఆదాయాలు కూడా అదే స్థాయిలో పెరిగాయా, సామాన్యుడి కొనుగోలు శక్తి పెరిగిందా అని ఈశ్వరయ్య ప్రశ్నించారు.
రైతు పండించిన పంటకు గిట్టుబాటు ధర దక్కడం లేదని, అదే పంట మార్కెట్‌కు వచ్చేసరికి వినియోగదారుడు మాత్రం అధిక ధర చెల్లించాల్సి వస్తోందని అన్నారు. రైతు దగ్గర తక్కువ ధర, వినియోగదారుడి దగ్గర అధిక ధర ఉండగా, మధ్యలో దళారీ వ్యవస్థ భారీగా లాభపడుతోందని విమర్శించారు. రైతు నుంచి వినియోగదారుడి వరకు కొనసాగుతున్న ఈ దోపిడీ గొలుసును తెంచాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందన్నారు.
కృత్రిమ కొరత, అక్రమ నిల్వలు, దళారీ వ్యవస్థ, బ్లాక్‌మార్కెట్ కారణంగా నిత్యావసర వస్తువుల ధరలు కృత్రిమంగా పెంచుతున్నా వాటిని అరికట్టడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమవుతున్నాయని ఈశ్వరయ్య విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం నిత్యావసర వస్తువుల ధరలను నిరంతరం పర్యవేక్షిస్తున్నామని చెబుతున్నప్పటికీ, మార్కెట్‌లో ధరల మంట ఎందుకు అదుపులోకి రావడం లేదని ప్రశ్నించారు. ప్రభుత్వాలు ధరలను పర్యవేక్షిస్తున్నామని చెబుతున్నా ప్రజల కొనుగోలు శక్తి, కుటుంబాలపై పడుతున్న భారాన్ని పట్టించుకోవడం లేదన్నారు.
ధరల పెరుగుదల వల్ల ప్రజల కొనుగోలు శక్తి తగ్గిపోతుండగా, రైతుల ఆదాయం కుంచించుకుపోతోందని, మరోవైపు దళారీలు, నిల్వదారుల లాభాలు పెరుగుతున్నాయని అన్నారు. ఇది కేవలం మార్కెట్‌కు సంబంధించిన సమస్య కాదని, ప్రజల జీవనంపై నేరుగా ప్రభావం చూపుతున్న పాలకుల విధాన వైఫల్యమని ఈశ్వరయ్య పేర్కొన్నారు.
నిత్యావసర వస్తువుల ధరలను వెంటనే తగ్గించాలని, బ్లాక్‌మార్కెట్, అక్రమ నిల్వలు, కృత్రిమ కొరతను అరికట్టాలని ఆయన డిమాండ్ చేశారు. అక్రమంగా నిల్వలు చేస్తున్న వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకోవాలని, మార్కెట్‌పై సమర్థవంతమైన పర్యవేక్షణ చేపట్టాలని కోరారు. రైతు నుంచి వినియోగదారుడి వరకు మధ్యలో ఉన్న దళారీ వ్యవస్థను నియంత్రించి రైతుకు గిట్టుబాటు ధర, వినియోగదారుడికి సరసమైన ధర లభించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.
రైతుబజార్లను మరింత బలోపేతం చేసి విస్తరించాలని, ప్రభుత్వ ఆధ్వర్యంలో నిత్యావసర వస్తువులను సరసమైన ధరలకు ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఈశ్వరయ్య కోరారు. పేదలు, కార్మికులు, రైతులు, మహిళలు, ఉద్యోగులు, చిరు వ్యాపారులు, మధ్యతరగతి కుటుంబాలపై పడుతున్న ధరల భారాన్ని తగ్గించేందుకు ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని అన్నారు.
పెట్రోల్, డీజిల్‌పై పన్నుల భారాన్ని తగ్గించి రవాణా ఖర్చులను తగ్గించాలని ఈశ్వరయ్య డిమాండ్ చేశారు. ఇంధన ధరలు, రవాణా ఖర్చులు పెరగడం వల్ల నిత్యావసర వస్తువుల ధరలపై అదనపు భారం పడుతోందన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో పెట్రోల్‌పై 31 శాతం వ్యాట్ తో పాటు ఇతర సెస్సులు, డీజిల్‌పై 22.25 శాతం వాట్ తో పాటు ఇతర సెస్సులు ఉన్నాయని అధికారిక గణాంకాలు వెల్లడిస్తున్నాయని తెలిపారు. ఇంధనంపై పన్నుల భారాన్ని తగ్గించడం ద్వారా రవాణా ఖర్చులను, తద్వారా నిత్యావసర వస్తువుల ధరలను తగ్గించే చర్యలు చేపట్టాలని కోరారు.
ప్రజల వంటింటిని మండిస్తున్న ధరల పెరుగుదలకు వ్యతిరేకంగా, బ్లాక్‌మార్కెట్, అక్రమ నిల్వలు, దళారీ దోపిడీని అరికట్టాలని, నిత్యావసర వస్తువుల ధరలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేస్తూ సెప్టెంబర్ 9న రాష్ట్రవ్యాప్తంగా సీపీఐ ఆధ్వర్యంలో నిరసనలు నిర్వహిస్తున్నట్లు గుజ్జుల ఈశ్వరయ్య ప్రకటించారు. జిల్లాలు, నియోజకవర్గాలు, మండలాలు, పట్టణాలు, గ్రామాల్లో నిర్వహించే ఈ ఆందోళనల్లో ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

## మహిళల సహజ ఉత్పత్తులకు మార్కెటింగ్ వేదికగా

# ‘వనస్య ది ఎక్స్‌పీరియన్స్ సెంటర్’.

**● మహిళల జీవనోపాధి, జీవన ప్రమాణాల మెరుగుదలే లక్ష్యం. ● ప్రజలు సెంటర్‌ను సందర్శించి మహిళల ఉత్పత్తులను ప్రోత్సహించాలి. ● జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా.**

పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. మహిళలు, గిరిజన మహిళలు తయారు చేస్తున్న సహజసిద్ధమైన ఉత్పత్తులకు మెరుగైన మార్కెటింగ్ సదుపాయం కల్పించి, వారి జీవనోపాధిని బలోపేతం చేయడంతో పాటు జీవన ప్రమాణాలను మెరుగుపరచే లక్ష్యంతో ‘వనస్య ది ఎక్స్‌పీరియన్స్ సెంటర్’ ఏర్పాటు చేసినట్లు జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని పిజిఆర్ఎస్ ఆవరణలో ఏర్పాటు చేసిన ‘వనస్య ది ఎక్స్‌పీరియన్స్ సెంటర్’ ను జిల్లా కలెక్టర్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్, అన్ని శాఖల జిల్లాధికారులు, సంబంధిత అధికారులు, మహిళా సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.
ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల్లో మహిళలు, స్థానిక ప్రజలు చేపడుతున్న వివిధ జీవనోపాధి కార్యకలాపాలను ప్రోత్సహించి, వారికి స్థిరమైన ఆదాయ అవకాశాలు కల్పించేందుకు వనస్య కేంద్రం ఒక సమర్థవంతమైన వేదికగా ఉపయోగపడుతుందని తెలిపారు. జిల్లాలో స్థానికంగా తయారయ్యే ఉత్పత్తులకు ప్రత్యేక మార్కెటింగ్ వేదికలు ఏర్పాటు చేస్తే మహిళా సంఘాలు, చిన్నతరహా ఉత్పత్తిదారులు, గిరిజన మహిళలు ఆర్థికంగా మరింత అభివృద్ధి చెందుతారనే ఉద్దేశంతో గౌరవ ముఖ్యమంత్రి ఇచ్చిన మార్గదర్శకాల మేరకు ఈ ఎక్స్‌పీరియన్స్ సెంటర్‌ను ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. వనస్య సెంటర్‌లో డి ఆర్ డి ఏ, మెప్మా, చేనేత, హార్టికల్చర్, ఎం ఎస్ ఎం ఈ, అటవీ శాఖల ఆధ్వర్యంలో మహిళా సంఘాలు, గిరిజన మహిళలు మరియు స్థానిక ఉత్పత్తిదారులు తయారు చేసిన వివిధ రకాల సహజసిద్ధమైన ఉత్పత్తులను ప్రదర్శనకు ఉంచడంతో పాటు విక్రయాలకు అందుబాటులో ఉంచినట్లు కలెక్టర్









వివరించారు. ప్రజలు నేరుగా సెంటర్‌ను సందర్శించి తమకు నచ్చిన ఉత్పత్తులను కొనుగోలు చేయవచ్చని, వ్యక్తిగత కొనుగోళ్లతో పాటు అవసరమైన వారు బల్క్ ఆర్డర్లు కూడా ఇవ్వవచ్చని తెలిపారు.
మహిళల ఆర్థిక స్వావలంబన, సాధికారతను పెంపొందించడంలో భాగంగా ‘వన్ ఫ్యామిలీ – వన్ ఎంటర్‌ప్రెన్యూర్’ లక్ష్యాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రతి కుటుంబంలో కనీసం ఒక మహిళ వ్యాపారవేత్తగా, పారిశ్రామికవేత్తగా ఎదిగి స్వయం ఉపాధి పొందేలా ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కేంద్రం నిర్మాణానికి సోలార్ ఎనర్జీ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్ ఈ ఎస్ ఐ) సి ఎస్ ఆర్ నిధుల ద్వారా ఆర్థిక సహకారం అందించిందని, ఎస్ ఇ సి ఐ సూచించిన స్వచ్ఛంద సంస్థ సహకారంతో పర్యావరణహితమైన వెదురు నిర్మాణంలో సెంటర్‌ను ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ తెలిపారు.
జిల్లాలోని మహిళలు, గిరిజన మహిళలు తయారు చేస్తున్న సహజసిద్ధమైన ఉత్పత్తులకు ప్రజలు ఆదరణ కల్పించి, వాటిని కొనుగోలు చేయడం ద్వారా మహిళల జీవనోపాధి మెరుగుదలకు తమ వంతు సహకారం అందించాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. కలెక్టరేట్‌కు వచ్చే ప్రతి ఒక్కరూ వనస్య ది ఎక్స్‌పీరియన్స్ సెంటర్‌ను సందర్శించి, అక్కడ ప్రదర్శిస్తున్న ఉత్పత్తులను పరిశీలించి, మహిళా ఉత్పత్తిదారులను ప్రోత్సహించాలని కోరారు. ఈ సందర్భంగా కేంద్రం నిర్మాణానికి సహకరించిన ఎస్ ఈ సి ఐ, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు, వినయ్ తదితరులకు జిల్లా యంత్రాంగం తరపున కలెక్టర్ కృతజ్ఞతలు తెలిపారు.

# భూ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక ప్రాధాన్యత.

● ఎండ్22ఏ నిషేధిత జాబితా, డాటెడ్ ల్యాండ్స్ సమస్యలకు వేగవంతమైన పరిష్కారం. ● ఆరు నెలల్లో 367 మంది రైతులకు 965 ఎకరాలకు పైగా భూ సమస్యలకు పరిష్కార. ● రైతులు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా పారదర్శకంగా సేవలు. ● జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి.

పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. రైతులు, భూ యజమానులు ఎదుర్కొంటున్న భూ సమస్యలను సత్వరమే పరిష్కరించి, వారికి న్యాయం చేయడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి తెలిపారు. సోమవారం కలెక్టరేట్లోని పిజిఆర్ఎస్ హాలులో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రజల నుంచి వినతులను స్వీకరించిన అనంతరం, మహానంది మండలానికి చెందిన 88 మంది రైతులకు సంబంధించిన 197 ఎకరాల భూ సమస్యలను పరిష్కరించి, ప్రొసీడింగ్స్ కాపీలను పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, 22ఏ నిషేధిత జాబితా నుంచి భూములను తొలగించడం, డాటెడ్ ల్యాండ్స్ సమస్యలను క్రమబద్ధీకరించడం వంటి అంశాలపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించి, అర్హులైన రైతులకు సకాలంలో న్యాయం చేయాలని ఆదేశించారు. భూ సమస్యల పరిష్కార ప్రక్రియలో పారదర్శకతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, అర్హత కలిగిన ప్రతి దరఖాస్తును నిబంధనల మేరకు క్షుణ్ణంగా పరిశీలించి, నిర్ణీత సమయంలో పరిష్కరించాలని సూచించారు.

**ఆరు నెలల్లో 965 ఎకరాలకు పైగా భూ సమస్యలకు పరిష్కారం**

జిల్లాలో గత ఆరు నెలల్లో 22ఏ నిషేధిత జాబితా నుంచి భూముల తొలగింపు, డాటెడ్ ల్యాండ్స్ క్రమబద్ధీకరణకు సంబంధించి 964 ఎకరాల 97 సెంట్ల భూమికి పరిష్కారం కల్పించినట్లు కలెక్టర్ తెలిపారు. తద్వారా జిల్లా వ్యాప్తంగా 367 మంది రైతులకు సంబంధించిన భూ సమస్యలు పరిష్కారమైనట్లు కలెక్టర్ వివరించారు. ఈ క్రమంలో ఆత్మకూరు డివిజన్లో 115 మంది రైతులకు సంబంధించిన 245 ఎకరాలు, బనగానపల్లె డివిజన్లో 33 మంది రైతులకు సంబంధించిన 135 ఎకరాలు, డోన్ డివిజన్లో 30 మంది రైతులకు సంబంధించిన 87 ఎకరాల 63 సెంట్ల భూమికి పరిష్కారం కల్పించినట్లు తెలిపారు. అదేవిధంగా నంద్యాల డివిజన్లో అత్యధికంగా 189 మంది రైతులకు సంబంధించిన 499 ఎకరాల భూమికి పరిష్కారం చూపినట్లు కలెక్టర్ వివరించారు. మహానంది మండలానికి చెందిన 88 మంది రైతులు 197 ఎకరాల భూ సమస్యల పరిష్కారం కోసం దరఖాస్తు చేసుకోగా, వాటన్నింటినీ పరిష్కరించి సంబంధిత రైతులకు ప్రొసీడింగ్స్ కాపీలను అందజేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు.

**రైతులు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేదు**

భూ సమస్యల పరిష్కారంలో సాంకేతికతను వినియోగిస్తూ ప్రక్రియను మరింత సరళతరం చేస్తున్నామని కలెక్టర్ తెలిపారు. రైతులు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా, వెబ్ల్యాండ్లో నమోదైన వివరాలకు సంబంధించిన కాపీలను ప్రొసీడింగ్స్తో పాటు నేరుగా అందజేస్తున్నామని పేర్కొన్నారు. భూమి తమ ఆధీనంలో ఉందని నిరూపించుకునేందుకు రైతులు అనవసరంగా పెద్ద సంఖ్యలో పత్రాలు సమర్పించాల్సిన అవసరం లేకుండా, నిబంధనల ప్రకారం అవసరమైన ప్రామాణిక ఆధార పత్రాల ఆధారంగా దరఖాస్తులను పరిశీలించి పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నామని




కలెక్టర్ తెలిపారు. భూ సమస్యల పరిష్కార ప్రక్రియలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, అనవసర జాప్యానికి తావులేకుండా అధికారులు సమర్థవంతంగా పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు.

**ఆర్ఎక్స్ కాపీల కోసం రైతులను ఇబ్బంది పెట్టవద్దు - జాయింట్ కలెక్టర్**

జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్ మాట్లాడుతూ, గత ఆరు నెలల్లో 965 ఎకరాల భూములను 22ఏ నిషేధిత జాబితా నుంచి తొలగించినట్లు తెలిపారు. 22ఏ భూముల తొలగింపు ప్రక్రియలో రైతులపై అనవసర పత్రాల భారం మోపకుండా, ఆర్ఎక్స్ కాపీలను అడిగి రైతులను ఇబ్బంది పెట్టవద్దని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశామన్నారు. 12 ఏళ్ల పొసెషన్కు సంబంధించిన రికార్డులు లేదా ఆర్ఓఆర్/మ్యుటేషన్ వివరాలు సక్రమంగా ఉన్నట్లయితే, వాటి ఆధారంగా దరఖాస్తులను పరిశీలించాలని సూచించినట్లు తెలిపారు. జీఓ-44 ప్రకారం కొన్ని భూ సమస్యల పరిష్కార అధికారాలను ఆర్డీఓలకు వికేంద్రీకరించినట్లు జాయింట్ కలెక్టర్ తెలిపారు. దీంతో ఆర్డీఓ స్థాయిలోనే కేసులను పరిశీలించి, నిబంధనల మేరకు అర్హత కలిగిన భూములను 22ఏ నిషేధిత జాబితా నుంచి తొలగించేలా చర్యలు చేపడుతున్నట్లు జెసి వివరించారు.

# విద్యారంగ సమస్యలను తక్షణమే పరిష్కరించాలి

**ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల రోడ్డు వద్ద డి ఎస్ ఎఫ్ ధర్నా**




ఆదోని (పల్లె వెలుగు): రాష్ట్రంలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని డెమోక్రటిక్ స్టూడెంట్స్ ఫెడరేషన్ (డి ఎస్ ఎఫ్) డిమాండ్ చేసింది. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన మౌలిక వసతులు కల్పించడం ప్రభుత్వ బాధ్యత అని పేర్కొంటూ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల రోడ్డు వద్ద డి ఎస్ ఎఫ్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు.
ధర్నా అనంతరం డి ఎస్ ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ధనాపురం ఉదయ్, ఆదోని డివిజన్ అధ్యక్షుడు వెంకటేష్ మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.
పెండింగ్లో ఉన్న ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని కోరారు. ఫీజు రీయింబర్స్మెంట్ ఆలస్యం కారణంగా విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ప్రభుత్వం ఈ సమస్యపై ప్రత్యేక దృష్టి సారించి బకాయిలను వెంటనే చెల్లించాలని అన్నారు.
సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థి సంఘాల ప్రవేశాన్ని నిషేధించే నిర్ణయాన్ని ప్రభుత్వం తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. హాస్టళ్లలో విద్యార్థులకు నాణ్యమైన భోజనం, స్వచ్ఛమైన తాగునీరు, పరిశుభ్రమైన వాతావరణం, మెరుగైన మౌలిక వసతులు కల్పించాలని కోరారు. అలాగే హాస్టళ్లకు సొంత భవనాలు నిర్మించి, విద్యార్థుల అవసరాలకు అనుగుణంగా వసతులు ఏర్పాటు చేయాలని అన్నారు.
రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్లో ఉన్న మెడికల్ కళాశాలల నిర్మాణ పనులను వెంటనే పునఃప్రారంభించి, వేగవంతం చేయాలని డిమాండ్ చేశారు. వైద్య విద్యతో పాటు ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి వచ్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.
ప్రభుత్వ విద్యాసంస్థల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయులు, అధ్యాపకులు, ఇతర సిబ్బంది పోస్టులను భర్తీ చేయాలని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలలు, డిగ్రీ కళాశాలల్లో తరగతి గదులు, మరుగుదొడ్లు, తాగునీరు తదితర మౌలిక వసతులను మెరుగుపరచాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ కళాశాలల్లో విద్యార్థులకు అవసరమైన లైబ్రరీలు, కంప్యూటర్ సదుపాయాలు ఏర్పాటు చేయాలని కోరారు.
ప్రభుత్వ డిగ్రీ కళాశాలలకు సొంత భవనాలు ఏర్పాటు చేయడంతో పాటు, ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా తరగతి గదులు, మరుగుదొడ్లు, ఇతర మౌలిక సదుపాయాలను కల్పించాలని కోరారు. అదేవిధంగా ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల్లో అక్రమ ఫీజుల వసూళ్లను అరికట్టి, ప్రభుత్వ నిబంధనలను కఠినంగా అమలు చేయాలని అన్నారు. విద్యార్థులు, తల్లిదండ్రులపై అనవసరమైన ఆర్థిక భారాన్ని మోపకుండా విద్యాసంస్థలపై ప్రభుత్వ పర్యవేక్షణను మరింత పెంచాలని డిమాండ్ చేశారు.
విద్యార్థుల సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం విద్యార్థి సంఘాలతో చర్చలు జరిపి, ప్రజాస్వామ్య పద్ధతిలో సమస్యలకు పరిష్కారం చూపాలని డి ఎస్ ఎఫ్ నాయకులు కోరారు. విద్యారంగాన్ని బలోపేతం చేసేందుకు ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోకపోతే విద్యార్థులను సమీకరించి ప్రజాస్వామ్య పద్ధతిలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని వారు ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

# ఏపీ పోలీస్ స్పోర్ట్స్ మీట్లో సత్తా చాటిన నంద్యాల జిల్లా పోలీసు క్రీడాకారులు .

**07 బంగారు, 10 వెండి, 13 కాంస్య పతకాలతో మొత్తం 30 పతకాలు సాధించారు..**

పల్లె వెలుగు నంద్యాల క్రైమ్. గుంటూరులోని నాగార్జున యూనివర్సిటీలో సెప్టెంబర్ 1వ తేదీ నుంచి 4వ తేదీ వరకు నిర్వహించిన ఏపీ పోలీస్ స్పోర్ట్స్ మీట్లో నంద్యాల జిల్లా




పోలీసు క్రీడాకారులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి మొత్తం 30 పతకాలు సాధించారు.
ఇందులో 07 బంగారు,10 వెండి,13 కాంస్య పతకాలు సాధించి జిల్లాకు కీర్తి ప్రతిష్టలు తీసుకొచ్చారు. అథ్లెటిక్స్, వెయిట్‌లిఫ్టింగ్, త్రోబాల్, టెన్నిస్, మార్షల్ ఆర్ట్స్, రెజ్లింగ్, ఆర్మ్ రెజ్లింగ్ తదితర క్రీడాంశాల్లో ప్రతిభ కనబరిచారు.
పోలీసు మహిళల విభాగంలో మార్షల్ ఆర్ట్స్, రెజ్లింగ్, ఆర్మ్ రెజ్లింగ్ క్రీడాంశాల్లో ఓవరాల్ ఛాంపియన్‌షిప్‌లో మొదటి స్థానం సాధించడం విశేషం. అలాగే పోలీసు పురుషుల విభాగంలో మార్షల్ ఆర్ట్స్‌లో రెండవ స్థానం సాధించారు.
ఈ సందర్భంగా విజేతలైన నంద్యాల జిల్లా పోలీసు క్రీడాకారులను జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్, ఐపీఎస్ సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో అభినందించారు.
క్రీడల్లో ప్రతిభ కనబరిచి జిల్లాకు గుర్తింపు తీసుకొచ్చిన క్రీడాకారులను అభినందిస్తూ, ఇదే స్ఫూర్తితో భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.
క్రీడాకారుల ప్రతిభకు ప్రోత్సాహం అందిస్తూ, పోలీసు సిబ్బంది శారీరక దృఢత్వంతో పాటు క్రీడా నైపుణ్యాలను పెంపొందించుకునేలా శాఖ తరఫున అవసరమైన ప్రోత్సాహం అందిస్తామని ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్ ఐపీఎస్ తెలిపారు.
ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ తో పాటు అడిషనల్ ఎస్పీ అడ్మిన్ ఎస్. ఖాదర్ భాషా , ఏ ఆర్ అడిషనల్ ఎస్పీ చిన్ని కృష్ణ , ఏ ఆర్ డీఎస్పీ శ్రీనివాసరావు , స్పెషల్ బ్రాంచ్ డిఎస్పి శ్రీనివాసరెడ్డి , ఆర్ ఐ లు బాబు, సురేష్ మరియు పోలీస్ క్రీడాకారులు పాల్గొన్నారు.

# ఆదోనిలో మహిళపై పెట్రోల్ పోసి హత్యాయత్నం

**ఆరుగురు నిందితులను అరెస్ట్ చేసిన 2 టౌన్ పోలీసులు**



ఆదోని (పల్లె వెలుగు): పాత కక్షల నేపథ్యంలో ఓ మహిళపై కారం చల్లి, పెట్రోల్ పోసి హత్యకు యత్నించిన ఘటనలో ఆరుగురు నిందితులను ఆదోని పోలీసులు అరెస్ట్ చేశారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు సోమవారం నిందితులను అదుపులోకి తీసుకున్నారు.
పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆదోని పట్టణంలోని సీపీఐ కాలనీకి చెందిన నరసమ్మ భర్త మృతి అనంతరం ఒంటరిగా జీవిస్తోంది. ఈ క్రమంలో మున్సిపాలిటీలో పనిచేస్తున్న చిన్న ఈరన్నతో ఆమెకు పరిచయం ఏర్పడింది. అనంతరం వీరిద్దరూ కలిసి జీవించినట్లు పోలీసులు తెలిపారు. అయితే ఈ సంబంధాన్ని ఈరన్న కుటుంబ సభ్యులు వ్యతిరేకించడంతో కుటుంబంలో వివాదాలు చోటుచేసుకున్నాయి.
ఈరన్నకు అమరావతి నగర్‌కు చెందిన శిరీషతో వివాహం జరిగినప్పటికీ నరసమ్మతో సంబంధం కొనసాగించడంతో కుటుంబంలో విభేదాలు మరింత పెరిగినట్లు పోలీసులు తెలిపారు. ఈరన్న భార్య ఫిర్యాదు మేరకు గతంలో ఆదోని 2 టౌన్ పోలీస్ స్టేషన్‌లో నరసమ్మపై కేసు కూడా నమోదైంది. అనంతరం పెద్దల సమక్షంలో పంచాయితీ నిర్వహించి ఈరన్న తన భార్యతో కలిసి సాయిబాబా నగర్‌లో నివాసం ఉంటున్నట్లు పోలీసులు వెల్లడించారు.
కుటుంబ పరిస్థితులు, మానసిక వేదనతో ఈరన్న జూలై 26న మృతి చెందాడు. అతడి మృతికి నరసమ్మే కారణమని భావించిన కుటుంబ సభ్యులు ఆమెపై కక్ష పెంచుకున్నట్లు పోలీసులు తెలిపారు.
ఈ నేపథ్యంలో సెప్టెంబర్ 6న తెల్లవారుజామున సుమారు 5.30 గంటల సమయంలో ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా విధుల్లో ఉన్న నరసమ్మ వద్దకు ఆరుగురు నిందితులు చేరుకున్నారు. ఆమెపై దాడి చేసి పెట్రోల్ పోసి నిప్పంటించేందుకు ప్రయత్నించినట్లు పోలీసులు తెలిపారు. ఘటనలో గాయపడిన నరసమ్మను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు.
బాధితురాలి ఫిర్యాదు మేరకు ఆదోని 2 టౌన్ పోలీసులు క్రైమ్ నంబర్ 170/2026 కింద కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. నిందితులు ఇతర ప్రాంతాలకు వెళ్లేందుకు ప్రయత్నిస్తున్న సమాచారం అందడంతో సోమవారం అమరావతి రోడ్డు, బసాపురం జంక్షన్ సమీపంలో వారిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.
అరెస్టయిన నిందితులు: శిరీష (ఏ1), రొట్టెలమ్మ (ఏ2), సుజాత (ఏ3), బి.పి. ఈరన్న (ఏ4), హేమ (ఏ5), అంజినమ్మ (ఏ6). నిందితులను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరచగా, న్యాయస్థానం రిమాండ్ విధించినట్లు పోలీసులు తెలిపారు. కేసుపై తదుపరి దర్యాప్తు కొనసాగుతున్నట్లు వెల్లడించారు.

# హత్య కేసులో సీసీఎల్ అదుపులోకి..

**48 గంటల్లోనే నిందితుడు స్వాధీనం..**

పాణ్యం సెప్టెంబర్ 7 పల్లె వెలుగు : మండల కేంద్రంలోని బోయ పేటకు చెందిన గోరుకంటి



చిన్న బాలు (20) హత్య కేసులో సీసీఎల్ ను పాణ్యం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.సిఐ కిరణ్ కుమార్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.ఈ నెల 5న గోరుకంటి రాముడు తన కుమారుడు చిన్న బాలును అదే గ్రామానికి చెందిన సీసీఎల్ పాణ్యం చెరువులో ఈత కొట్టేందుకు పిలుచుకెళ్లినట్లు తెలిపారు.అక్కడ ఈత విషయంలో ఇద్దరి మధ్య పందెం ఏర్పడి, అనంతరం మాటామాటా పెరిగి పరస్పరం దూషించుకున్నట్లు పేర్కొన్నారు.దీంతో ఆగ్రహానికి గురైన సీసీఎల్ తన ఇంటికి వెళ్లి పిడిబాకు తీసుకువచ్చి,చెరువు కట్ట వద్ద చిన్న బాలుపై దాడి చేసినట్లు సీఐ తెలిపారు.ఈ ఘటనలో చిన్న బాలు మృతి చెందినట్లు వెల్లడించారు.
కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఎస్సై నరేంద్ర కుమార్ రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కేసు నమోదు చేసిన 48 గంటల్లోపే, సోమవారం కొనిదేడు గ్రామ శివారులో భూపనపాడు వెళ్లే రహదారి వద్ద సీసీఎల్‌ను అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు.
అతని వద్ద నుంచి ఒక కత్తిని స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. అనంతరం సీసీఎల్‌ను బాలల న్యాయ స్థానంలో హాజరుపరిచేందుకు పంపించినట్లు పోలీసులు తెలిపారు.

## నంద్యాలలో రాష్ట్రస్థాయి చెస్ పోటీలు.



పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. నంద్యాల జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో, ఎన్ఆర్జీ చెస్ అకాడమీ నిర్వహణలో ఈ నెల 12న నంద్యాల టెక్కేలోని నెరవాటి ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో రాష్ట్రస్థాయి చెస్ పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా చెస్ సంఘం అధ్యక్షుడు డాక్టర్ రవికృష్ణ, కార్యదర్శి రామసుబ్బారెడ్డి సోమవారం తెలిపారు. 12 వివిధ వయసు విభాగాల్లో పోటీలు నిర్వహించి, ప్రతి విభాగంలో 10 చొప్పున మొత్తం 120 బహుమతులు అందజేస్తామని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న క్రీడాకారులు ఈ నెల 9వ తేదీ సాయంత్రంలోపు ఏపీ చెస్ వెబ్‌సైట్ ద్వారా పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. వివరాలకు 9010451585, 9573661799 నంబర్లను సంప్రదించాలని తెలిపారు.

## ద్విచక్ర వాహనాల సైలెన్సర్లపై ట్రాఫిక్ పోలీసుల కొరడా: ఐదుగురికి జరిమానా

పల్లె వెలుగు కర్నూలు బ్యూరో నగర ప్రజలకు తీవ్ర అసౌకర్యం కలిగిస్తూ, విపరీతమైన






శబ్ద కాలుష్యానికి కారణమవుతున్న మోడిఫైడ్ సైలెన్సర్ల వాడకంపై కర్నూలు ట్రాఫిక్ పోలీసులు కొరడా ఝుళిపించారు. జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్, కర్నూలు డీఎస్పీ (రాణూరా) రవీంద్ర ఆదేశాల మేరకు ట్రాఫిక్ సీఐ ఆధ్వర్యంలో వెంకటరమణ కాలనీలో ప్రత్యేక తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో నిబంధనలకు విరుద్ధంగా మార్పులు చేసిన సైలెన్సర్లతో తిరుగుతున్న ఐదు మోటార్ సైకిళ్లను గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. సదరు వాహనదారులకు భారీగా జరిమానాలు విధించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ సీఐ మాట్లాడుతూ.. ద్విచక్ర వాహనాలకు విపరీత శబ్దాలు వచ్చే సైలెన్సర్లు అమర్చి రోడ్లపై ప్రజలను, ముఖ్యంగా వృద్ధులు, చిన్నారులను భయభ్రాంతులకు గురిచేస్తే చట్టపరమైన కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. నిబంధనలు అతిక్రమిస్తే జరిమానాలతో పాటు వాహనాలను సీజ్ చేస్తామని స్పష్టం చేశారు.

## ఉలిందకొండ పీఎస్‌లో శాంతి కమిటీ సమావేశం: వినాయక చవితి వేడుకలకు ఆన్‌లైన్ అనుమతి తప్పనిసరి

పల్లె వెలుగు కర్నూలు బ్యూరో వినాయక చవితి పండుగను మండల ప్రజలు, భక్తులు




శాంతియుత వాతావరణంలో, ఆనందోత్సాహాల మధ్య జరుపుకోవాలని ఉలిందకొండ పోలీసులు పిలుపునిచ్చారు. ఈ మేరకు స్థానిక పోలీస్ స్టేషన్‌లో పరిధిలోని అన్ని గ్రామాల ప్రజలు, గణేష్ ఉత్సవ కమిటీ నిర్వాహకులతో శాంతి కమిటీ (పీస్ కమిటీ) సమావేశం నిర్వహించారు.

ఈ సమావేశంలో పోలీసు అధికారులు మాట్లాడుతూ పలు కీలక సూచనలు, నిబంధనలను వివరించారు: ఆన్‌లైన్ అనుమతి తప్పనిసరి: విగ్రహాలను ప్రతిష్టించే ప్రతి నిర్వాహకుడు తప్పనిసరిగా పోలీసు శాఖ నిర్దేశించిన పోర్టల్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుని ముందస్తు అనుమతి పొందాలి. శాంతిభద్రతల పరిరక్షణ: పండుగ రోజుల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రతి ఒక్కరూ పోలీసులకు పూర్తి స్థాయిలో సహకరించాలి. నిమజ్జనం నిబంధనలు: నిమజ్జనం రోజున పోలీసుల ట్రాఫిక్, భద్రతా మార్గదర్శకాలను ఖచ్చితంగా పాటించాలి. చిన్నారుల రక్షణ: ప్రమాదాలను నివారించేందుకు నిమజ్జనం జరిగే నీటి వనరుల వద్దకు చిన్నపిల్లలను తీసుకురాకూడదు. మద్యంపై నిషేధం: మద్యం సేవించి ఊరేగింపుల్లోగానీ, నిమజ్జన కార్యక్రమాల్లోగానీ పాల్గొంటే చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నిబంధనలు అతిక్రమించి శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఉపేక్షించేది లేదని, ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించి ఉత్సవాలను ప్రశాంతంగా ముగించాలని అధికారులు స్పష్టం చేశారు.

## మహానంది ఆర్యవైశ్య సత్రంలో అభివృద్ధి పనుల ప్రారంభం

మహానంది, పల్లె వెలుగు మహానంది పుణ్యక్షేత్రంలోని శ్రీ వాసవి ఆర్యవైశ్య సత్రం యందు నూతనంగా నిర్మించిన పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. సోమవారం అన్న సత్ర



అధ్యక్షులు ఆత్మకూరు సుదర్శన్ శెట్టి, ప్రధాన కార్యదర్శి నేరవాటి రవికుమార్ ఆధ్వర్యంలో రూ. 25 లక్షల సిమెంట్ రోడ్డు, రూ. 15 లక్షలతో నిర్మించిన లిఫ్ట్ లను రుత్వికుల వేదమంత్రాలతో ఘనంగా ప్రారంభించారు. ముందుగా గణపతి పూజ, వాస్తు పూజ, లోహ పూజ కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ. దాతలు విసనకర్ర వెంకటసుబ్బ సత్యనారాయణ, కుటుంబ సభ్యులు, క్రీ. శే. బచ్చు తిరుపాలయ్య కుటుంబ సభ్యుల సహకారంతో నూతన లిఫ్ట ప్రారంభోత్సవం నిర్వహించడం జరిగిందన్నారు. అనంతరం దాతలు, ఇంజనీర్లను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మరకత లింగేశ్వర స్వామి ఆలయ నిర్వాహకులు మస్తాన్ రావు, సత్రం కమిటీ సభ్యులు, గ్రామస్తులు, దాతలు పాల్గొన్నారు.

# చిన్న విగ్రహాలతో వినాయక చవితి జరుపుకుందాం

పల్లె వెలుగు కర్నూలు రిపోర్టర్ : ఎల్‌నినో



ప్రభావం, వర్షాభావ పరిస్థితుల కారణంగా నీటి లభ్యత తగ్గిన నేపథ్యంలో ఈ ఏడాది వినాయక చవితి పండుగను చిన్న మట్టి విగ్రహాలతో నిర్వహించుకుని, స్థానికంగానే నిమజ్జనం చేసుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు నగర ప్రజలకు పిలుపునిచ్చారు. నగరంలోని ఏడు లక్షల మంది ప్రజల తాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని తాగునీటిని వినాయక నిమజ్జనం కోసం వినియోగించలేమని స్పష్టం చేశారు. సోమవారం స్థానిక ఎస్‌బీఐ ఎంప్లాయిస్ కాలనీలోని నగరపాలక సంస్థ సమావేశ భవనంలో మున్సిపల్, జలవనరుల శాఖ అధికారులతో కలిసి కమిషనర్ విలేకరుల సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. వినాయక నిమజ్జనం కోసం నగరపాలక సంస్థ అన్ని విధాలా సిద్ధంగా ఉందని, అయితే ప్రస్తుత నీటి పరిస్థితుల కారణంగా కేసీ కెనాల్‌లోని వినాయక ఘాట్‌కు నిమజ్జనం కోసం నీటిని విడుదల చేసే పరిస్థితి లేదన్నారు. సుంకేసుల, గాజులదిన్నె తదితర జలాశయాలు, ప్రాజెక్టుల్లో అదనపు నీరు అందుబాటులో లేదని తెలిపారు. మంత్రి టీజీ భరత్, కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి, జలవనరుల శాఖ అధికారులతో కలిసి నిమజ్జనానికి నీటి లభ్యతపై సాధ్యాసాధ్యాలన్నింటినీ పరిశీలించినట్లు పేర్కొన్నారు. కేసీ కెనాల్‌కు ప్రధాన నీటి వనరైన సుంకేసుల జలాశయంలో నీటి నిల్వలు గణనీయంగా తగ్గాయని కమిషనర్ తెలిపారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న నీటిని నగర ప్రజల తాగునీటి అవసరాలకే వినియోగించాల్సిన పరిస్థితి ఉందన్నారు. గతంలో సుంకేసుల జలాశయంలో సుమారు 1.20 టీఎంసీలు, గాజులదిన్నె ప్రాజెక్టులో సుమారు 2.28 టీఎంసీలు, సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులో సుమారు 4,410 మిలియన్ లీటర్లు అంటే 0.16 టీఎంసీల నీటి నిల్వలు ఉండగా, మొత్తం సుమారు 3.64 టీఎంసీల నీటి లభ్యత ఉండేదని వివరించారు. అయితే ప్రస్తుతం వర్షాభావ పరిస్థితుల కారణంగా నీటి నిల్వలు గణనీయంగా తగ్గిపోయాయని తెలిపారు. ప్రస్తుతం గాజులదిన్నె ప్రాజెక్టులో సుమారు 1.561 టీఎంసీల నీటి నిల్వ మాత్రమే అందుబాటులో ఉందని కమిషనర్ తెలిపారు. ఈ నీటిని రానున్న రోజుల్లో రోజుకు సుమారు 40 నుంచి 45 క్యూసెక్కుల చొప్పున సమ్మర్ స్టోరేజ్ ట్యాంకుకు సరఫరా చేస్తూ, నగరంలోని సుమారు ఏడు లక్షల మంది ప్రజల తాగునీటి అవసరాలకు వినియోగిస్తే నవంబర్ మాసం వరకు మాత్రమే సరిపోయే అవకాశం ఉందన్నారు. అక్టోబర్‌లో తుంగభద్ర జలాశయం నుంచి సుంకేసులకు నీటిని విడుదల చేయించేందుకు అవసరమైన నీటి కోటాను కోరే వరకు అందుబాటులో ఉన్న నీటి వనరులను అత్యంత పొదుపుగా వినియోగించాల్సిన అవసరం ఉందన్నారు. అదేవిధంగా హంద్రీ-నీవా ప్రధాన కాలువలో కూడా ప్రస్తుతం ఉన్న నీటి లభ్యత ఈ నెల 21వ తేదీ వరకు మాత్రమే ఉంటుందని కమిషనర్ తెలిపారు. ఆ తర్వాత కాలువలో నీటి లభ్యత ఉండే అవకాశం లేకపోవడంతో హంద్రీ-నీవా కాలువలో కూడా వినాయక నిమజ్జనం నిర్వహించే పరిస్థితి లేదని స్పష్టం చేశారు. తుంగభద్ర ఎగువ ప్రాంతాలైన కర్ణాటకలో వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో నీటి ప్రవాహం పెరిగి సుంకేసులకు నీరు వస్తుందని తొలుత ఆశించామని, అయితే తుంగభద్ర జలాశయం కూడా ఆశించిన స్థాయిలో నిండని పరిస్థితి నెలకొందని కమిషనర్ తెలిపారు. దీంతో సుంకేసులకు అదనపు నీటి ప్రవాహం లేకపోవడంతో కేసీ కెనాల్‌లోని వినాయక ఘాట్‌కు నిమజ్జనం కోసం నీటిని విడుదల చేయడం సాధ్యం కాదన్నారు. ఈ పరిస్థితుల్లో నగర ప్రజలందరూ విజ్ఞతతో వ్యవహరించి 1 నుంచి 1.5 అడుగుల లోపు ఉండే చిన్న మట్టి విగ్రహాలను మాత్రమే ప్రతిష్ఠించి పూజించాలని కమిషనర్ సూచించారు. ఇళ్లలో, వీధుల్లో చిన్నపాటి విగ్రహాలను ప్రతిష్ఠించి, పూజల అనంతరం బకెట్లు, టబ్బుల్లోనే స్థానికంగా నిమజ్జనం చేసుకోవాలని కోరారు. పెద్ద విగ్రహాలను తీసుకురావద్దని, ఇప్పటికే ఆర్డర్ ఇచ్చి ఉంటే వీలైనంత వరకు రద్దు చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఇప్పటికే పెద్ద గణనాథుని విగ్రహాలను తెచ్చుకున్న వారు వాటిని నిమజ్జనం చేయకుండా భద్రపరచుకునేందుకు ఐదు ప్రత్యేక మైదానాలను ఎంపిక చేసినట్లు కమిషనర్ తెలిపారు. సుంకేసుల రోడ్డులోని రైల్వే పట్టాల పక్కన, ఎంఆర్‌సీ ఫంక్షన్ హాల్ పక్కన, వెంకటరమణ కాలనీలోని పర్యాటక హోటల్ వెనుక ఉన్న ఖాళీ మైదానంతో పాటు ఏ. క్యాంపు, జొహరాపురం ప్రాంతాల్లోని ఖాళీ మైదానాలను ఇందుకోసం పరిశీలించినట్లు పేర్కొన్నారు. పెద్ద విగ్రహాలను వచ్చే ఏడాది వరకు భద్రపరచుకునేలా ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. అయితే గణనాథుని ఆశీస్సులతో పండుగలోపు వర్షాలు కురిస్తే, వర్షపు నీరు వృథాగా పోకుండా వినాయక ఘాట్ వద్ద నిల్వ చేసేందుకు అడ్డుకట్ట నిర్మిస్తున్నామని కమిషనర్ తెలిపారు. వర్షాలు కురవకపోతే ఘాట్‌లో నిమజ్జనానికి సరిపడా నీరు ఉండదని స్పష్టం చేశారు. వర్షాల కారణంగా తగినంత నీరు లభ్యమైతే నిమజ్జన ఏర్పాట్లపై తదుపరి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. తాగునీటి అవసరాలే అత్యంత ప్రాధాన్యమైనవని, అందుబాటులో ఉన్న నీటిని ప్రజల తాగునీటి అవసరాల కోసం కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని కమిషనర్ పేర్కొన్నారు. నగర ప్రజలు, వినాయక ఉత్సవ కమిటీలు, నిర్వాహకులు వాస్తవ పరిస్థితులను అర్థం చేసుకుని నగరపాలక సంస్థకు, జలవనరుల శాఖకు పూర్తి సహకారం అందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో నగరపాలక ఎస్ఈ రమణమూర్తి, నీటిపారుదల శాఖ కర్నూలు సర్కిల్ ఎస్ఈ జి. శైలేశ్వర్, హంద్రీ-నీవా సర్కిల్-1 ఎస్ఈ రాజన్ బాబు, హంద్రీ-నీవా డివిజన్-2 కార్యనిర్వహణ ఇంజినీర్ ఎన్. ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

# టీడీపీ లీడర్‌షిప్ కాంక్లేవ్‌లో మీనాక్షి నాయుడు

**మంగళగిరి కేంద్ర కార్యాలయంలో రెండు రోజుల శిక్షణ కార్యక్రమం**




ఆదోని (పల్లె వెలుగు): తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు, ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు, జాతీయ ప్రధాన కార్యదర్శి, మంత్రి లోకేష్ ఆధ్వర్యంలో మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహిస్తున్న రెండు రోజుల "టీడీపీ ప్రజాప్రతినిధుల లీడర్‌షిప్ కాంక్లేవ్"లో ఆదోని నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే శ్రీ మీనాక్షి నాయుడు పాల్గొన్నారు. పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధుల్లో నాయకత్వ లక్షణాలను మరింతగా పెంపొందించడం, పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయడం, ప్రజలతో మరింత సన్నిహితంగా మమేకం కావడం వంటి అంశాలపై ఈ కాంక్లేవ్‌లో శిక్షణ, అవగాహన కల్పిస్తున్నారు. పార్టీ సిద్ధాంతాలు, విధానాలను ప్రజల్లోకి మరింత విస్తృతంగా తీసుకెళ్లడం, ప్రజా సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేయడం, కార్యకర్తలతో సమన్వయం చేసుకుంటూ పార్టీ కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించడం వంటి అంశాలపై నాయకులకు దిశానిర్దేశం చేస్తున్నారు. అలాగే ప్రజాప్రతినిధులుగా తమ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించడం, నియోజకవర్గ అభివృద్ధిపై దృష్టి సారించడం, ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు చేరువ చేయడం తదితర అంశాలపై కూడా కాంక్లేవ్‌లో చర్చిస్తున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. రెండు రోజుల పాటు నిర్వహిస్తున్న ఈ శిక్షణ కార్యక్రమం ద్వారా నాయకుల్లో నాయకత్వ పటిమను పెంపొందించడంతో పాటు, పార్టీ సంస్థాగత నిర్మాణాన్ని మరింత పటిష్టం చేసేందుకు అవసరమైన కార్యాచరణపై అవగాహన కల్పిస్తున్నారు. ఈ లీడర్‌షిప్ కాంక్లేవ్‌లో పాల్గొన్న మీనాక్షి నాయుడు పార్టీ నాయకత్వం సూచనలు, శిక్షణ అంశాలను తెలుసుకున్నారు. ఈ శిక్షణ ద్వారా ఆదోని నియోజకవర్గంలో పార్టీ కార్యకలాపాలను మరింత సమన్వయంతో ముందుకు తీసుకెళ్లేందుకు, కార్యకర్తలను మరింత చురుకుగా భాగస్వామ్యం చేసేందుకు ఉపయోగపడుతుందని పార్టీ శ్రేణులు పేర్కొన్నాయి.

# స్పీడ్ బ్రేకర్లా.. ప్రజలకు శిక్షలా!

**ఆదోనిలో అడ్డగోలు స్పీడ్ బ్రేకర్లు తొలగించండి**

**మున్సిపల్ అధికారుల తీరుపై నూర్ అహ్మద్ ఫైర్.**

ఆదోని (పల్లె వెలుగు): ఆదోని పట్టణంలో అడ్డగోలుగా ఏర్పాటు చేసిన స్పీడ్ బ్రేకర్లపై మైనారిటీ హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర కార్యదర్శి నూర్ అహ్మద్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజల భద్రత పేరుతో ఇష్టారాజ్యంగా స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేసి వాహనదారులు, ప్రయాణికులకు ఇబ్బందులు కలిగించడం సరికాదని ఆయన మండిపడ్డారు. పట్టణంలోని నిబంధనలకు విరుద్ధంగా, అవసరం లేకుండా ఏర్పాటు చేసిన స్పీడ్ బ్రేకర్లను తక్షణమే తొలగించాలని మున్సిపల్ అధికారులను డిమాండ్ చేశారు.

నూర్ అహ్మద్ సోమవారం విలేకరులతో మాట్లాడుతూ ఆదోని పట్టణంలోని పలు ప్రధాన రహదారులు, కాలనీల్లో ఇబ్బడి ముబ్బడిగా స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ముఖ్యంగా ఎత్తుగా నిర్మించిన స్పీడ్ బ్రేకర్లను దాటే సమయంలో వాహనాలు ఒక్కసారిగా కుదుపులకు గురవుతున్నాయని, వాహనాల్లో ప్రయాణించే ప్రజలు అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

**కొద్ది దూరంలోనే ఐదారు బ్రేకర్లా?**

ొన్ని ప్రాంతాల్లో కొద్ది దూరంలోనే వరుసగా ఐదారు స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయడం అధికారుల పనితీరుకు అద్దం పడుతోందని నూర్ అహ్మద్ విమర్శించారు. వాహనాల వేగాన్ని నియంత్రించాల్సిన స్పీడ్ బ్రేకర్లు ప్రజలకు, వాహనదారులకు ప్రమాదకరంగా మారకూడదన్నారు. స్పీడ్ బ్రేకర్ల నిర్మాణంలో కనీస ప్రమాణాలు పాటించకపోవడం వల్ల వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు.



**నిబంధనల ప్రకారమే ఏర్పాటు చేయాలి**

ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని అవసరమైన ప్రాంతాలను గుర్తించి, ప్రభుత్వ నిబంధనలు, ప్రమాణాలకు అనుగుణంగా మాత్రమే స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని ఆయన కోరారు. ఇప్పటికే అడ్డగోలుగా ఏర్పాటు చేసిన స్పీడ్ బ్రేకర్లను అధికారులు పరిశీలించి, అవసరం లేనివాటిని వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ అధికారులు ఇకనైనా స్పందించి యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టాలని నూర్ అహ్మద్ కోరారు. సమస్యను పరిష్కరించడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడంతో పాటు, అవసరమైతే లోకాయుక్తను ఆశ్రయించి న్యాయపరమైన చర్యలు తీసుకోవడానికి కూడా వెనుకాడబోమని ఆయన హెచ్చరించారు.

# తప్పుడు ప్రచారాలతో బతికే గొడ్డలి పార్టీకి ఆధారాలతో తగిన సమాధానం.

**మాన్వి దేవేంద్రప్ప ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కురువ కార్పొరేషన్ చైర్మన్.**



ఆదోని (పల్లె వెలుగు): రాష్ట్రంలో గొడ్డలి పార్టీ చేస్తున్న ఫేక్ ప్రచారాలు, విషపూరిత అసత్యాలు ఇప్పుడు పతాక స్థాయికి చేరాయని రాష్ట్ర కురువ కార్పొరేషన్ చైర్మన్ మాన్వి దేవేంద్రప్ప తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ఈరోజు ఆదోని పట్టణంలోని తన క్యాంప్ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు లీడర్‌షిప్ కాంక్లేవ్‌లో చెప్పిన ప్రతి మాట అక్షర సత్యమని అన్నారు.
గత ఐదేళ్ల అధికారంలో రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో సర్వనాశనం చేసి, ఇప్పుడు ప్రతిపక్షంలో ఉండి కూడా బురద చల్లే కార్యక్రమాన్ని కొనసాగిస్తోందని ఆయన విమర్శించారు. వారి సిద్ధాంతమే హిట్-రన్-హైడ్ అని, అసెంబ్లీలో ప్రజా సమస్యలపై చర్చించే దమ్ము, ధైర్యం లేక బయట ఫేక్ యూట్యూబ్ ఛానల్స్‌కు, సోషల్ మీడియా పేజీలకు డబ్బులు ఇచ్చి అబద్ధాలు ప్రచారం చేయిస్తున్నారని ఆరోపించారు.
నంద్యాల, ప్రకాశం జిల్లాల రైతుల జీవనాడి అయిన వెలిగొండ ప్రాజెక్టును ఐదేళ్లు పక్కన పడేసింది ఈ గొడ్డలి పార్టీనేనని, పోలవరం ఎడమ కాలువను తవ్వకుండా ఉత్తరాంధ్ర రైతులకు తీరని ద్రోహం చేసిందని దేవేంద్రప్ప గుర్తు చేశారు. అలాగే పురుషోత్తపట్నం ఎత్తిపోతల పథకాన్ని నిర్వీర్యం చేసి ఉత్తరాంధ్రను ఎడారిగా మార్చాలని చూశారని, ఏపీపీఎస్సీ లాంటి పవిత్రమైన ఉద్యోగ వ్యవస్థలో కూడా తమ సొంత మనుషులను నియమించుకుని లక్షలాది మంది నిరుద్యోగుల జీవితాలతో చెలగాటం ఆడారని మండిపడ్డారు.
అధికారంలో ఉన్నప్పుడు పోలీస్ వ్యవస్థను చేతిలో పెట్టుకుని అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారని, ఇప్పుడు అదే వ్యవస్థ ప్రక్షాళన అవుతుంటే తట్టుకోలేకపోతున్నారని ఎద్దేవా చేశారు. అమరావతిని స్మశానంగా మార్చాలని చూసి, మూడు రాజధానుల పేరుతో రాష్ట్రాన్ని భ్రమలో పెట్టిన పాపం వారిదేనని, ఇప్పుడు అమరావతి మళ్లీ ప్రపంచ స్థాయి రాజధానిగా ఎదుగుతుంటే కడుపు మంటతో ఫేక్ ప్రచారం చేస్తున్నారని అన్నారు.
గొడ్డలి పార్టీకి విలువలు లేవని, విశ్వసనీయత లేదని, నోట్లో ఒక మాట నాలిక మీద ఒక మాట మాట్లాడే పార్టీ అని విమర్శించారు. అందుకే ప్రజలు 2024 ఎన్నికల్లో వారిని ఇంటికి పంపించారని, ఇప్పుడు మళ్లీ అబద్ధాలతో ప్రజల్లోకి వద్దామని చూస్తే ప్రజలే తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు.
ముఖ్యమంత్రి పిలుపు మేరకు ప్రతి కార్యకర్త ఒక సైనికుడిలా పని చేసి, ప్రతి గ్రామంలో, ప్రతి వార్డులో వారి ఫేక్ ప్రచారాన్ని ఆధారాలతో, లెక్కలతో సహా తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. రాబోయే స్థానిక ఎన్నికల్లో గొడ్డలి పార్టీకి తగిన గుణపాఠం చెబుతామని దేవేంద్రప్ప స్పష్టం చేశారు.

# ఆహార శుద్ధి రంగంలో సూక్ష్మ పరిశ్రమల ఏర్పాటుకు పి ఎం ఎఫ్ ఎం ఈ పథకం అండ.

**రైతులకు అదనపు ఆదాయం.. స్థానికంగా ఉపాధి అవకాశాల కల్పనే లక్ష్యం.**
**35 శాతం సబ్సిడీతో పాటు బ్యాంకు రుణ సదుపాయం.**
**గానుగ నూనె వినియోగంతో ఆరోగ్యకర సమాజానికి ప్రోత్సాహం.**
**జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి.**

పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. ఆహార శుద్ధి రంగంలో సూక్ష్మ పరిశ్రమలను ప్రోత్సహించడం ద్వారా రైతులు, మహిళలు, ఔత్సాహికులకు అదనపు ఆదాయ మార్గాలు కల్పించడంతో పాటు స్థానికంగా ఉపాధి అవకాశాలను పెంపొందించడమే ప్రధాన మంత్రి సూక్ష్మ ఆహార సంస్కరణ పరిశ్రమల క్రమబద్ధీకరణ ( పి ఎం ఎఫ్ ఎం ఈ) పథకం ముఖ్య ఉద్దేశమని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి తెలిపారు. సోమవారం నంద్యాల పట్టణంలోని అయ్యలూరు మెట్ట ప్రాంతంలో పి ఎం ఎఫ్ ఎం ఈ పథకం ద్వారా ఏర్పాటు చేసిన "స్వేచ్ఛ బుల్ డ్రివెన్ ఆయిల్స్" గానుగ నూనె తయారీ యూనిట్‌ను కలెక్టర్ ప్రారంభించారు.
ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రైతులు, స్వయం సహాయక సంఘాల మహిళలు, రైతు ఉత్పత్తిదారుల సంఘాలు ( ఎఫ్ పి ఓ లు), వ్యక్తిగత ఔత్సాహికులు ఆహార శుద్ధి రంగంలో యూనిట్లను ఏర్పాటు చేసుకునేందుకు ప్రభుత్వం అన్ని విధాలుగా ప్రోత్సాహం అందిస్తోందన్నారు.

**35 శాతం సబ్సిడీతో యూనిట్ల ఏర్పాటు**

పి ఎం ఎఫ్ ఎం ఈ పథకం ద్వారా అర్హత కలిగిన లబ్ధిదారులకు ప్రాజెక్టు వ్యయంలో 35 శాతం వరకు సబ్సిడీ, గరిష్టంగా రూ.10 లక్షల వరకు ఆర్థిక సహాయం అందుతుందని కలెక్టర్ తెలిపారు. ఈ పథకం క్రెడిట్ లింక్డ్ పథకంగా అమలవుతున్నందున, బ్యాంకుల సహకారంతో యూనిట్ల ఏర్పాటుకు అవసరమైన రుణ



సదుపాయాన్ని కూడా కల్పిస్తున్నామని పేర్కొన్నారు. ఈ పథకాన్ని ఆంధ్రప్రదేశ్ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ ద్వారా అమలు చేస్తున్నామని తెలిపారు. ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో లబ్ధిదారులకు సబ్సిడీ, బ్యాంకు రుణాల అనుసంధానం, యూనిట్ల స్థాపనకు అవసరమైన మార్గదర్శక సహకారం అందిస్తున్నట్లు కలెక్టర్ వివరించారు.

**నంద్యాల జిల్లాలో 56 యూనిట్ల లక్ష్యం.. 41 యూనిట్ల గ్రౌండింగ్**

నంద్యాల జిల్లాకు ప్రస్తుత సంవత్సరానికి 56 ప్రాసెసింగ్ యూనిట్ల లక్ష్యం నిర్దేశించగా, ఇప్పటివరకు 41 యూనిట్లను విజయవంతంగా గ్రౌండింగ్ చేసినట్లు కలెక్టర్ తెలిపారు. అధికారుల సమిష్టి కృషితో జిల్లాలో ఆహార శుద్ధి రంగానికి సంబంధించిన అనేక సూక్ష్మ పరిశ్రమలు ఏర్పాటవుతున్నాయని పేర్కొన్నారు. పి ఎమ్ ఎఫ్ ఎమ్ ఈ పథకం ద్వారా లబ్ధిదారులు ఆర్థికంగా స్వయం సమృద్ధి సాధించడంతో పాటు, భవిష్యత్తులో మరింత విస్తరించి ఇతరులకు కూడా ఉపాధి కల్పించే స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. రైతుల ఉత్పత్తులకు విలువ జోడించడం ద్వారా వారి ఆదాయాన్ని పెంచేందుకు ఇటువంటి యూనిట్లు ఎంతో దోహదపడతాయని

**గానుగ నూనె వినియోగాన్ని ప్రోత్సహించాలి**

ప్రస్తుతం ప్రజల్లో ఆరోగ్యంపై అవగాహన పెరుగుతున్న నేపథ్యంలో సహజసిద్ధమైన, నాణ్యమైన, ఆర్గానిక్ ఉత్పత్తుల వినియోగం వైపు ఆసక్తి పెరుగుతోందని కలెక్టర్ అన్నారు. ఈ నేపథ్యంలో సాంప్రదాయ పద్ధతిలో గానుగ ద్వారా తయారయ్యే కోల్డ్ ప్రెస్డ్ నూనెలకు ఆదరణ పెరుగుతున్న సమయంలో ఇటువంటి యూనిట్‌ను ఏర్పాటు చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. అయ్యలూరు మెట్టలో ఏర్పాటు చేసిన "స్వేచ్ఛ బుల్ డ్రివెన్ కోల్డ్ ప్రెస్ ఆయిల్ యూనిట్"లో వేరుశెనగ, నువ్వులు తదితర నూనె గింజల నుంచి సాంప్రదాయ పద్ధతిలో గానుగ నూనెను తయారు చేసి వినియోగదారులకు అందించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. మొత్తం ప్రాజెక్టు వ్యయం రూ.3,79,875లు కాగా, ఇందులో కెనరా బ్యాంకు ద్వారా రూ.3,39,983ల రుణం, లబ్ధిదారుడి వాటాగా రూ.39,887లు సమకూరగా, పి ఎమ్ ఎఫ్ ఎమ్ ఈ పథకం కింద 35 శాతం సబ్సిడీగా రూ.1,32,954లు మంజూరైనట్లు తెలిపారు.
ఇలాంటి సూక్ష్మ ఆహార శుద్ధి పరిశ్రమలను మరింతగా ప్రోత్సహించి, రైతుల ఉత్పత్తులకు స్థానికంగానే విలువ జోడించి మార్కెటింగ్ అవకాశాలను కల్పించేలా అధికారులు చర్యలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. అర్హులైన ఔత్సాహికులు పి ఎమ్ ఎఫ్ ఎమ్ ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకుని స్వయం ఉపాధితో పాటు ఇతరులకు ఉపాధి కల్పించే పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని కలెక్టర్ ఆకాంక్షించారు.

# బండి ఆత్మకూరు మండలాన్ని కరువు మండలం గా ప్రకటించాలి



బండి ఆత్మకూరు పల్లె వెలుగు సెప్టెంబర్ 7:బండి ఆత్మకూరు మండలాన్ని కరువు మండలం గా ప్రకటించాలని కోరుతూ ప్రజాసంఘాల ఆధ్వర్యంలో
బండి ఆత్మకూర్ తాసిల్దార్ కార్యాలయం ముందు ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో సోమవారం ధర్నా నిర్వహించారు. ధర్నా కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి రామచంద్రుడు జిల్లా నాయకుడు సురేష్ మండల నాయకుడు సుధాకర్ రెడ్డి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు డేవిడ్ సిఐటియు జిల్లా నాయకుడు రత్నమయ్య వ్యవసాయ కార్మిక సంఘం సీనియర్ నాయకులు రామచంద్రుడు లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో సాగు భూములు 34 వేల ఎకరాలు ఉండగా నేటికీ కేవలం 15 వేల ఎకరాల భూములలో అరకొర పంట వేయడం జరిగిందని అన్నారు. ప్రధానంగా వరి మొక్కజొన్న మినుము పంటలు సాగు చేశారని, బోర్లు వంక వాగులు ఆధారంగా సాగుచేసిన పంటలు ఎండిపోయాయని అన్నారు. మండలంలో సగటున 53 శాతం సాధారణ వర్షపాతం కూడా లేకపోవడంతో రైతులు వరి నారుమల్లనను,సాలు వరి వేసి నీరు అందక పంటలు ఎండిపోయి రైతుకు ఎకరాకు 20000 రూపాయలు పెట్టుబడి పెట్టి నష్టపోయారని రైతులను ఆదుకోవాలని కోరారు.మరోవైపు శ్రీశైలం తెలుగంగ కేసీ కెనాల్ సాగునీరు ఉన్న త్రాగునీటికే ప్రాధాన్యత ఇస్తున్నామన్న ప్రభుత్వం రైతులను ఆదుకోవడానికి సాగునీరైనా అందించాలని అన్నారు. లేకపోతే మండలాన్ని కరువు మండలంగా ప్రకటించి రైతులకు బ్యాంకు రుణాలు రద్దు చేయాలని ఉచిత పంటల బీమా అమలు చేసి నష్టపరిహారం ఇవ్వాలని, వేలాది ఎకరాలు కౌలుకు తీసుకొని పంటలు పండించే కౌలు రైతులకు రుణాలు ఇవ్వాలని, ఆరుతడి పంటలు వేసుకునే రైతులకు ఉచితంగా విత్తనాలు ఎరువులు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ కూలీలకు అన్ని గ్రామాలలో ఉపాధి పనులు కల్పించి కరువు కూపన్లు ఇవ్వాలని నిత్యవసర వస్తువులు ఉచితంగా అందించాలని కోరారు.కార్యక్రమంలో రైతులు తిమ్మయ్య,రమణ దాసు, దరగయ్యతదితరులు పాల్గొన్నారు.ధర్నా అనంతరం తాసిల్దార్ పద్మావతమ్మకు వినతి పత్రాన్ని అందజేశారు.

# సూర్యనారాయణ స్వామి ఆలయంలో ఘనంగా శ్రావణ సోమవార పూజలు



పల్లె వెలుగు కర్నూలు బ్యూరో నగరంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ సూర్యనారాయణ స్వామి దేవాలయంలో పవిత్ర శ్రావణ మాసం నాల్గవ సోమవారాన్ని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు అత్యంత వైభవంగా జరిగాయి. అవధూత దత్తపీఠాధిపతి పరమపూజ్య శ్రీశ్రీశ్రీ గణపతి సచ్చిదానంద స్వామీజీ దివ్య ఆశీస్సులతో ఈ ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు. శ్రావణ సోమవారం సందర్భంగా ప్రాతఃకాలంలోనే ఆలయంలో వెలసిన గౌరీ శంకర స్వామి వారికి వేదపండితులు శాస్త్రోక్తంగా లఘున్యాస పూర్వక రుద్రాభిషేకాలు, విశేష అర్చనలు నిర్వహించారు. వేద మంత్రోచ్చారణలు, శివనామస్మరణతో ఆలయ ప్రాంగణం భక్తిపారవశ్యంతో మార్మోగింది. పూజా కార్యక్రమాల అనంతరం విచ్చేసిన భక్తులకు స్వామివారి తీర్థప్రసాద వితరణ గావించారు. పెద్ద సంఖ్యలో హాజరైన భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

# కృపానగర్‌లో అభివృద్ధికి మరో అడుగు.. రూ.4 లక్షలతో సీసీ రోడ్డుకు శంకుస్థాపన




పోరుమామిళ్ల, సెప్టెంబర్ 7( పల్లె వెలుగు) కడప జిల్లా పోరుమామిళ్ల మండలం అక్కల్‌రెడ్డిపల్లె పంచాయతీ పరిధిలోని కృపానగర్‌లో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. జెడ్పీ నిధులు రూ. 4 లక్షల వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్డుకు ఎంపీటీసీ రవి ఆధ్వర్యంలో శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించారు.
గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం నిధులు కేటాయిస్తూ అభివృద్ధి పనులకు ప్రాధాన్యత ఇస్తోందని ఈ సందర్భంగా స్థానికులు పేర్కొన్నారు. సీసీ రోడ్డు నిర్మాణంతో కృపానగర్ వాసుల రాకపోకలకు ఇబ్బందులు తొలగి, రహదారి సౌకర్యం మెరుగుపడనుందని తెలిపారు.
పల్లెల అభివృద్ధే లక్ష్యంగా రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు, వీధి దీపాలు తదితర మౌలిక వసతులపై దృష్టి సారించాల్సిన అవసరం ఉందని గ్రామస్తులు కోరారు. తమ ప్రాంతంలో సీసీ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు కావడంపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి పనులు కొనసాగితే ప్రజలకు మెరుగైన సౌకర్యాలు అందడంతో పాటు పల్లెల రూపురేఖలు మారే అవకాశం ఉందని స్థానికులు అభిప్రాయపడ్డారు.

# రాంప్రియనగర్‌లో అక్రమ నిర్మాణాలు తొలగించండి కలెక్టర్‌కు బాధితుల వినతి

పల్లె వెలుగు కర్నూలు బ్యూరో కర్నూలు నగర పరిధిలోని రాంప్రియనగర్ సర్వే నంబర్ 686/1లో గల 4.57 సెంట్ల స్థలంలో చేపట్టిన అక్రమ నిర్మాణాలను తక్షణమే తొలగించి తమకు న్యాయం చేయాలని భూ హక్కుదారులు జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ. సిరిని కోరారు.



సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' (పీజీఆర్ఎస్) కార్యక్రమంలో బాధితులు కలెక్టర్‌కు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ.. సదరు భూమిపై వివిధ న్యాయస్థానాల్లో విచారణ జరిగి తమకే అనుకూలంగా తీర్పులు వచ్చాయని, ఆ స్థలంపై పూర్తి హక్కులు తమకే ఉన్నాయని స్పష్టం చేశారు. గతంలో న్యాయస్థానం స్టేటస్‌కో ఉత్తర్వులు జారీ చేసినప్పటికీ, కొందరు వ్యక్తులు నిబంధనలకు విరుద్ధంగా అక్కడ అక్రమ నిర్మాణాలు చేపట్టారని ఆరోపించారు. ఆ నిర్మాణాలకు ఇచ్చిన అనధికార అనుమతులు, అప్రూవల్స్‌ను రద్దు చేసి వెంటనే కూల్చివేయాలని విజ్ఞప్తి చేశారు.
తాము ఆ స్థలంలో ప్రహరీ గోడ నిర్మించుకుంటుండగా ప్రత్యర్థులు అడ్డుకుని, దుర్భాషలాడుతూ దాడులకు పాల్పడుతున్నారని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. తమకు ప్రాణరక్షణ కల్పించి, స్థలాన్ని కాపాడాలని వేడుకున్నారు. ఈ వ్యవహారంపై కలెక్టర్ సానుకూలంగా స్పందించి, తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో బాధితులు ఎం. బ్రహ్మానందరెడ్డి, పీవీ బ్రహ్మారెడ్డి, ఆర్. ఇమ్మానియేల్, సంజీవరెడ్డి తదితరులు ఉన్నారు.

# మాజీ సైనికుల స్థలాలకే ఎసరు!



పల్లె వెలుగు కర్నూలు బ్యూరో దేశ సరిహద్దుల్లో ప్రాణాలను పణంగా పెట్టి సేవలందించిన మాజీ సైనికులకు ప్రభుత్వం కేటాయించిన స్థలాలకే రక్షణ కరువైందని వారి వారసులు ఆవేదన వ్యక్తం చేశారు. నందనపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని మిలిటరీ కాలనీలో జరుగుతున్న అక్రమ ఆక్రమణలు, తప్పుడు పట్టాలు, అనుమానాస్పద రిజిస్ట్రేషన్లపై సమగ్ర విచారణ జరిపించాలని కోరుతూ సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన పీజీఆర్ఎస్ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్‌కు లిఖితపూర్వకంగా వినతిపత్రం సమర్పించారు.
ఈ సందర్భంగా మాజీ సైనికుల వారసులు మాట్లాడుతూ.. కాలనీలోని స్థలాలకు సంబంధించి రెవెన్యూ, రిజిస్ట్రేషన్ శాఖల రికార్డులను సమన్వయం చేసి పూర్తిస్థాయి విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. కొందరు వ్యక్తులు నిబంధనలకు విరుద్ధంగా తప్పుడు పట్టాలు సృష్టించి ప్రభుత్వ, సైనిక స్థలాలను ఆక్రమించి అక్రమ రిజిస్ట్రేషన్లకు పాల్పడుతున్నారని ఆరోపించారు.
అంతేకాకుండా కాలనీవాసుల అవసరాల నిమిత్తం నిర్మించుకున్న మరుగుదొడ్లను తొలగించాలంటూ తమపై తీవ్రస్థాయిలో ఒత్తిళ్లు, వేధింపులకు గురిచేస్తున్నారని వాపోయారు. ప్రజా ప్రయోజనార్థం ఉన్న ఈ సదుపాయాలను కూల్చివేయకుండా చట్టబద్ధమైన రక్షణ కల్పించాలని కోరారు. మాజీ సైనికులు, వారి కుటుంబాల హక్కులను కాపాడేందుకు రికార్డులను పకడ్బందీగా సరిచేసి, అక్రమార్కులపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులకు విజ్ఞప్తి చేశారు.

Printed and published by M.Mahesh babu on behaly of m/s mahesh publications # 13-36A, Nelliveedhi, Nandyal District, Nadyal printed at sai Aishwayam Apartment, Near Bharatha Matha Temple B-Block, Flat no 105, Tekke, Nandyal (Dist) AP pin-code 518501 EDITOR; M Mahesh Babu RNI No: APTEL/2012/46499Phone No :-9849499960,9059696959 Email id: Pallevelugunews9@gmail.com

## ఎన్టీఆర్ భరోసా పింఛన్లకు కొత్త దరఖాస్తుల స్వీకరణ.

పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. ఎన్టీఆర్ భరోసా పింఛన్ పథకం కింద అర్హులైన కొత్త



లబ్ధిదారుల నుంచి దరఖాస్తులను స్వీకరించేందుకు ప్రభుత్వం మార్గదర్శకాలను విడుదల చేసిందని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి తెలిపారు. సోమవారం కలెక్టరేట్లోని పిజిఆర్ఎస్ హాల్లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం అనంతరం నూతన ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పథకంపై జిల్లా, మండల స్థాయి అధికారులకు దిశానిర్దేశం చేశారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్, డిఆర్ఓ రామునాయక్, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఎన్టీఆర్ భరోసా పింఛన్ పథకం కింద సెప్టెంబరు 7 నుంచి 16వ తేదీ వరకు స్వర్ణ గ్రామం, స్వర్ణ వార్డు కార్యాలయాల్లో కొత్త పింఛన్ దరఖాస్తులను స్వీకరించి, ఆన్‌లైన్‌లో నమోదు చేయనున్నట్లు తెలిపారు. పూర్తి చేసిన దరఖాస్తులను అవసరమైన ధ్రువపత్రాలతో సంబంధిత కార్యాలయాల్లో సమర్పించాలని, డిజిటల్ అసిస్టెంట్/వార్డు ఎడ్యుకేషన్ అండ్ డేటా ప్రాసెసింగ్ సెక్రటరీ ( డబ్ల్యూ ఈ డి పి ఎస్) వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసి ఈ- కేవైసీ పూర్తి చేసిన అనంతరం దరఖాస్తుదారులకు రశీదు అందజేస్తారని కలెక్టర్ తెలిపారు. దరఖాస్తుల ప్రాథమిక అర్హతలను సెప్టెంబరు 17 నుంచి 21 వరకు పరిశీలించనున్నారని, అర్హత పొందిన దరఖాస్తులకు సెప్టెంబరు 22 నుంచి 24 వరకు క్షేత్రస్థాయి పరిశీలన నిర్వహిస్తారని కలెక్టర్ తెలిపారు. అనంతరం తుది పరిశీలన, బడ్జెట్ ప్రతిపాదనలు ప్రభుత్వానికి సమర్పించే ప్రక్రియను సెప్టెంబరు 25, 26 తేదీల్లో చేపడతారని వివరించారు.

కొత్త పింఛన్లకు దరఖాస్తు చేసుకునే వారు ఆధార్ కార్డు, రైస్ కార్డు/ఆదాయ ధ్రువీకరణ పత్రంతో పాటు పింఛన్ కేటగిరీకి సంబంధించిన అవసరమైన ధ్రువపత్రాలను సమర్పించాలని కలెక్టర్ సూచించారు. వితంతువులు భర్త మరణ ధ్రువీకరణ పత్రం, వికలాంగులు 40 శాతం లేదా అంతకంటే ఎక్కువ వైకల్యం ఉన్నట్లు తెలిపే సదరమ్ సర్టిఫికెట్, ఇతర ప్రత్యేక కేటగిరీల వారు సంబంధిత అధికారుల ధ్రువపత్రాలను సమర్పించాల్సి ఉంటుందని తెలిపారు.

ప్రభుత్వం నుంచి బడ్జెట్ విడుదలైన అనంతరం అర్హులైన వారికి పింఛన్ మంజూరు ఉత్తర్వులు ఆన్‌లైన్‌లో జారీ అవుతాయని, పింఛన్ మంజూరైన నెల నుంచే చెల్లింపులు వర్తిస్తాయని, గత నెలలకు సంబంధించి బకాయి చెల్లింపులు ఉండవని కలెక్టర్ స్పష్టం చేశారు. అర్హులైన ప్రతి ఒక్కరూ నిర్ణీత గడువులోగా దరఖాస్తు చేసుకుని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, అధికారులు కాలపట్టికను కచ్చితంగా పాటిస్తూ దరఖాస్తుల పరిశీలనను పారదర్శకంగా, వేగవంతంగా పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు.

## అన్నెం శివ నాగిరెడ్డి గారికి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు



శిరివెళ్ల ( పల్లె వెలుగు (కోటపాడు):- మండల పరిధిలోని కోటపాడు గ్రామానికి చెందిన అన్నెం శివ నాగిరెడ్డి గారు నేడు 61వ జన్మదిన వేడుకలు జరుపుకుంటున్న సుభ సందర్భంగా ఆయనకు పలువురు ఆప్తమిత్రులు శ్రేయోభిలాషులు బంధుమిత్రులు తన క్రింది స్థాయి సిబ్బంది హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. 61వ వసంతంలో కి అడుగుపెడుతున్న శుభ సందర్భంగా అన్నెం శివనాగిరెడ్డి గారు ఆయురారోగ్యాలతో అష్టైశ్వర్యాలతో సుఖసంతోషాలతో భోగభాగ్యాలతో వర్ధిల్లాలని పలువురు ఆ దేవుని వేడుకుంటున్నట్లు తెలియజేశారు. ఈ సందర్భంగా భారీ కేకును కట్ చేసి ఆయన అభిమానులు పంచిపెట్టారు.

## ఆర్థిక సంక్షోభం నుండి ఆంధ్రప్రదేశ్ పోలీస్ వ్యవస్థ ను ప్రభుత్వం ఆదుకోవాలని ,,,,,,,

**ఆంధ్రప్రదేశ్ పోలీసులకు రావాల్సిన దాదాపు 223? కోట్ల అడిషనల్ సరెండర్ లీవ్ అలవెన్స్ ,,,,,**



ఎమ్మిగనూరు పల్లె వెలుగు సెప్టెంబర్ సమతా సైనిక్ దళ్ రాష్ట్ర అధికార ప్రతినిధి రంగయ్య ప్రెస్ మీట్ ముఖం గా మాట్లాడుతూ కనిపించే న్యాయం ధర్మం మన పోలీస్ అయితే అలాంటి పోలీస్ వ్యవస్థ ప్రస్తుతం తీవ్రమైన ఆర్థిక సంక్షోభం లో ఉంది. గత ప్రభుత్వం నుండి పెండింగ్ లో ఉన్న పోలీసులకు రావలసిన అడిషనల్ సరెండర్ లీవ్ అలవెన్సు తక్షణమే కూటమి ప్రభుత్వం విడుదల చేసి ఆర్థిక సంక్షోభం లో ఉన్న పోలీస్ వ్యవస్థ ను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. పోలీస్ వ్యవస్థలో పని చేసే ప్రతీ ఉద్యోగి ఆర్థిక భారమైన జీవితం అనుభవిస్తున్నారని అయన ఆవేదన వ్యక్తం చేశారు. మీడియా కూడా ఇందుకు సహకరించి హో మంత్రి అనిత గారు మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు గారి ద్రుష్టి కీ తీసుకోని వెళ్లాల్సిన బాధ్యత తీసుకోవాలని అయన గుర్తు చేశారు. గత ప్రభుత్వం పూర్తి గా పోలీస్ వ్యవస్థ ను విస్మరించిందని దాదాపు 2022 నుండి పోలీస్ లకు రావాల్సిన అడిషనల్ సరెండర్ లీవ్ ఇతరాత్ర అలవెన్సు ఇవ్వకపోవడం తో తీవ్రమైన ఆర్థిక సంక్షోభం తో పోలీస్ వ్యవస్థ ఉన్నదని ప్రతీ పోలీస్ ఉద్యోగి పరిస్థితి చాలా దుర్భారంగా ఉన్నదని రంగయ్య గారు తెలిపారు.ఇప్పటికి ప్రభుత్వం దాదాపు గా 223 కోట్ల బకాయిలు చెల్లించాల్సి ఉందని తక్షణమే కూటమి ప్రభుత్వం చెల్లించి ఆదుకోవాలని తెలిపారు.ప్రతీ రోజు ఎన్నో సవాళ్ళను ఎదుర్కొని జీవనం సాగిస్తున్న ప్రతీ కుటుంబం లో వెలుగులు నింపాలని ఈ విషయంలో ప్రభుత్వం స్పందించేవరకు సోషల్ మీడియా ముఖం గా స్పందిస్తూ అవసరం నీ బట్టి ఈ అంశం పై ఉద్యమ కార్యాచరణ ఉంటుందని ప్రభుత్వం కీ లేఖ రాస్తునట్టు అయన తెలిపారు.కార్యక్రమం లో సమతా సైనికులు పాల్గొన్నారు.

## ప్రజా దరఖాస్తులను బియాండ్ ఎస్ఎల్ఏకు వెళ్లకుండా నాణ్యతతో పరిష్కరించాలి.

**పిజిఆర్ఎస్‌కు 263 దరఖాస్తులు.**

**రీఓపెన్ దరఖాస్తుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలి.**

**జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా.**



పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) ద్వారా ప్రజలు సమర్పించే ప్రతి దరఖాస్తును నిర్ణీత గడువులోగా, నాణ్యతతో పరిష్కరించి ప్రజలకు సత్వర న్యాయం అందేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లోని పిజిఆర్ఎస్ హాలులో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రజల నుంచి వినతులను స్వీకరించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజా దరఖాస్తులు బియాండ్ ఎస్ఎల్ఏకు వెళ్లకుండా ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, పెండింగ్ దరఖాస్తులను వేగంగా పరిష్కరించాలని సూచించారు. పిజిఆర్ఎస్ ద్వారా మొత్తం 263 దరఖాస్తులు స్వీకరించినట్లు తెలిపారు. ప్రతి దరఖాస్తును సంబంధిత అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి, నిబంధనల మేరకు నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని ఆదేశించారు.

రీఓపెన్ దరఖాస్తులపై ప్రత్యేక దృష్టి

రీఓపెన్ అయిన దరఖాస్తుల్లో ఇంకా 66 దరఖాస్తులు పరిష్కరించాల్సి ఉందని కలెక్టర్ తెలిపారు. వాటిని సంబంధిత అధికారులు ప్రత్యేకంగా పరిశీలించి, పెండింగ్‌కు గల కారణాలను గుర్తించి త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. అదేవిధంగా రాష్ట్ర



ముఖ్యమంత్రి గారికి ప్రజలు అందజేసిన దరఖాస్తుల్లో పెండింగ్‌లో ఉన్న వాటిపై కూడా ప్రత్యేక దృష్టి సారించి, సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో చర్యలు చేపట్టాలని సూచించారు.

రెవెన్యూ క్లినిక్స్ ద్వారా 131 దరఖాస్తుల స్వీకరణ

భూ సమస్యలను క్షేత్రస్థాయిలోనే పరిశీలించి సత్వర పరిష్కారం అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన రెవెన్యూ క్లినిక్స్ ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందుతున్నాయని జిల్లా కలెక్టర్ తెలిపారు. భూ సమస్యలకు సంబంధించిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి, నిబంధనల మేరకు పరిష్కరించేందుకు రెవెన్యూ క్లినిక్స్ ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయని పేర్కొన్నారు. రెవెన్యూ క్లినిక్స్ ద్వారా మొత్తం 131 దరఖాస్తులు స్వీకరించగా, అందులో రెవెన్యూ, గ్రామ/వార్డు సచివాలయ సేవలకు సంబంధించినవి 7, అడంగల్ సవరణలకు సంబంధించినవి 16, చుక్కల భూముల క్రమబద్ధీకరణ, 22-ఏ భూములకు సంబంధించినవి 10, అసైన్డ్ భూములు, భూ ఆక్రమణలకు సంబంధించినవి 20, రెవెన్యూ కోర్టు విచారణలు/ఆర్ఓఆర్‌కు సంబంధించినవి 36, సర్వే, రీ-సర్వేలకు సంబంధించినవి 33, దేవాదాయ, వక్ఫ్ భూములకు సంబంధించినవి 9 ఉన్నట్లు కలెక్టర్ వివరించారు.

పిజిఆర్ఎస్‌లో ప్రజలు సమర్పించిన కొన్ని దరఖాస్తులు

1)రుద్రవరం మండలం బీరవోలు గ్రామానికి చెందిన ఎల్. బాలస్వామి తనకు సర్వే నెం.102/2లో 5 ఎకరాల 12 సెంట్ల భూమి ఉందని, గత 40 సంవత్సరాలుగా ఆ భూమిని సాగు చేసుకుంటున్నప్పటికీ చుక్కల భూమిగా నమోదైందని తెలిపారు. సదరు భూమిని చుక్కల భూముల జాబితా నుంచి తొలగించి న్యాయం చేయాలని కోరుతూ కలెక్టర్‌కు దరఖాస్తు సమర్పించారు.

2)నంద్యాల అర్బన్ పరిధిలోని కొత్తపల్లి గ్రామానికి చెందిన పి. వీరమ్మ తనకు సర్వే నెం.1459/11లో 0.53 సెంట్ల భూమి ఉందని, అది అసైన్మెంట్ ఫ్రీహోల్డ్‌గా నమోదైందని తెలిపారు. సదరు భూమిని అసైన్మెంట్ ఫ్రీహోల్డ్ నుంచి తొలగించి న్యాయం చేయాలని కోరుతూ కలెక్టర్‌కు దరఖాస్తు సమర్పించారు.

3)పాణ్యం మండలం తోగరచేడు గ్రామానికి చెందిన నరసింహులు తనకు వృద్ధాప్య పింఛన్ మంజూరు చేయాలని కోరుతూ జిల్లా కలెక్టర్‌కు దరఖాస్తు సమర్పించారు.

ఈ సందర్భంగా ప్రజలు సమర్పించిన ప్రతి దరఖాస్తును సంబంధిత అధికారులు బాధ్యతగా తీసుకుని, సమస్యను క్షేత్రస్థాయిలో పరిశీలించి, నిబంధనల మేరకు సకాలంలో పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్, డిఆర్ఓ రాము నాయక్, పిజిఆర్ఎస్ నోడల్ ఆఫీసర్ ఉమామహేశ్వరి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, నంద్యాల ఆర్డీఓ విశ్వనాథ్, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## వారసుల హక్కులు పక్కనపెట్టి భూమి మ్యూటేషన్.. ఆన్‌లైన్‌లో అక్రమ నమోదు

పోరుమామిళ్ల, సెప్టెంబర్ 7( పల్లె వెలుగు ):పేదల భూముల విషయంలో రెవెన్యూ రికార్డుల నిర్వహణపై మరోసారి ప్రశ్నలు తలెత్తుతున్నాయి. పోరుమామిళ్ల మండలం బొప్పాపురం గ్రామంలో 1987లో డీకేటీ పట్టా కింద మంజూరైన భూమికి సంబంధించి ఆన్‌లైన్ రికార్డుల మార్పుపై కుటుంబ సభ్యుల మధ్య వివాదం నెలకొంది.

బాధితుడు ఆనందరావు తెలిపిన వివరాల ప్రకారం.. బొప్పాపురం గ్రామంలోని సర్వే నంబర్ 187-1లో 15-08-1987న డీకేటీ పట్టా కింద 1.79 ఎకరాల భూమి తమ కుటుంబానికి మంజూరైందని తెలిపారు. ఈ భూమికి సంబంధించి తమ తల్లి చాటకొండ జీవమ్మకు ముగ్గురు సంతానం ఉన్నారని పేర్కొన్నారు.

అయితే తమ కుటుంబంలోని ఒక వ్యక్తి ఎలాంటి ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ లేదా ఇతర వారసత్వ ఆధారాలు సమర్పించకుండానే రెవెన్యూ రికార్డుల్లో తన పేరును నమోదు చేయించుకుని ఆన్‌లైన్‌లో భూమిని మార్చుకున్నారని ఆనందరావు ఆరోపించారు. ఈ వ్యవహారంపై ఇప్పటికే కలెక్టర్ కార్యాలయంలో పలుమార్లు ఫిర్యాదు చేసినప్పటికీ న్యాయం జరగలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

**వారసత్వ మార్పుకు ఆధారాలు ఉన్నాయా?**

ఒక వ్యక్తి మాత్రమే తన పేరుపై భూమిని మ్యూటేషన్ చేయించుకున్నట్లయితే, ఆ మార్పుకు సంబంధించిన దరఖాస్తు, వారసుల వివరాలు, కుటుంబ సభ్యుల ధ్రువీకరణ/వారసత్వ ఆధారాలు, పాత రెవెన్యూ రికార్డులు, విచారణ వివరాలు, సంబంధిత నోటీసులు మరియు ఆన్‌లైన్ మ్యూటేషన్‌కు ఆధారమైన పత్రాలు పరిశీలించాల్సిన అవసరం ఉందని బాధితుడు కోరుతున్నారు.

అన్ని వారసులకు హక్కు ఉన్న సందర్భంలో, మిగిలిన వారసుల హక్కులను పరిగణనలోకి తీసుకోకుండా ఒక్కరి పేరుపై రికార్డు మార్పు చేశారు. ఏ ఆధారాలపై, ఏ అధికారి అనుమతితో ఆన్‌లైన్ మార్పు చేశారు? అనే అంశాలపై స్పష్టత రావాల్సి ఉంది.

**జేసీ, ఆర్డీవో సమగ్ర విచారణ చేయాలి**

తన తల్లి పేరుతో ఉన్న భూమికి సంబంధించి జరిగినట్లు చెబుతున్న ఆన్‌లైన్ మార్పుపై జాయింట్ కలెక్టర్ (జేసీ), ఆర్డీవో స్థాయి అధికారులు సమగ్ర విచారణ చేపట్టి, పాత డీకేటీ రికార్డులు, అసైన్‌మెంట్ రిజిస్టర్, కుటుంబ వారసుల వివరాలు, మ్యూటేషన్ దరఖాస్తు, ఆన్‌లైన్ ఎంట్రీకి ఆధారమైన పత్రాలు పరిశీలించాలని ఆనందరావు విజ్ఞప్తి చేశారు.

నిజంగా ఫ్యామిలీ సర్టిఫికెట్ లేదా సరైన వారసత్వ ఆధారాలు లేకుండానే రికార్డు మార్చి ఉంటే బాధ్యులపై చర్యలు తీసుకుని, అర్హులైన వారసుల



హక్కులను కాపాడాలని ఆయన కోరారు.

## స్థానిక ఎన్నికల్లో జనసేన జెండా ఎగరాలి.. ప్రతి పంచాయతీలో ప్రజలకు అభివృద్ధి అందాలి: శీలంశెట్టి లక్ష్మయ్య

పోరుమామిళ్ల: 7 (పల్లె వెలుగు):రానున్న స్థానిక



సంస్థల ఎన్నికల్లో జనసేన పార్టీ శ్రేణులు సమష్టిగా పనిచేసి ప్రతి పంచాయతీలో పార్టీ జెండా ఎగరేయాలని పోరుమామిళ్ల మండల జనసేన అధ్యక్షుడు శీలంశెట్టి లక్ష్మయ్య పిలుపునిచ్చారు. విదేశాల్లో ఉన్న పార్టీ అభిమానులు, కార్యకర్తలు సైతం ఎన్నికల సమయంలో స్వగ్రామాలకు చేరుకుని పార్టీ విజయానికి కృషి చేయాలని కోరారు.

రాష్ట్రంలోని 175 నియోజకవర్గాల్లో ప్రతి మండలం, ప్రతి పంచాయతీలో జనసేన జెండా ఎగరేయడమే పార్టీ ఆశయమని లక్ష్మయ్య పేర్కొన్నారు. ఎంపీటీసీ, జెడ్పీటీసీ, గ్రామ పంచాయతీ, మున్సిపల్ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో అన్ని స్థానాల్లో పార్టీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో ముందుకు సాగాలని సూచించారు. ఇప్పటివరకు ఉన్న జనసేన లో సమన్వయాన్ని మరింత బలోపేతం చేసుకుంటూ, స్థానిక సంస్థల ఎన్నికల్లో జనసేన పార్టీ సమర్థవంతంగా ముందుండాల్సిన అవసరం ఉందన్నారు.

గ్రామస్థాయిలో ప్రజల సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేయడంతో పాటు, అభివృద్ధిని ప్రజలకు చేరువ చేయడమే లక్ష్యంగా పనిచేయాలని అన్నారు.

గతంలో అనేక మంది ముఖ్యమంత్రులు, ఉప ముఖ్యమంత్రులు, మంత్రులు అధికారంలోకి వచ్చినప్పటికీ ప్రజలు ఆశించిన స్థాయిలో అభివృద్ధి జరగలేదని లక్ష్మయ్య విమర్శించారు. అయితే పవన్ కళ్యాణ్ ప్రజా సమస్యలపై ప్రత్యేక శ్రద్ధ చూపుతూ అభివృద్ధి కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇస్తున్నారని పేర్కొన్నారు.

2014-2019 కాలంలో జరిగిన అభివృద్ధితో పాటు, 2019-2024 మధ్య ప్రజలు ఎదుర్కొన్న పరిస్థితులను కూడా ప్రజలు గమనించారని అన్నారు. ప్రస్తుతం జనసేన వచ్చినఅనంతరం రహదారుల అభివృద్ధి, సాగునీటి వసతులు, రైతులకు సంబంధించిన సంక్షేమ కార్యక్రమాలు, గ్రామీణ మౌలిక వసతుల కల్పన వంటి అంశాలకు ప్రాధాన్యత ఇస్తున్నారని తెలిపారు.

అదేవిధంగా గతంలో ఎంతోమంది ఎంపీటీసీలు, జడ్పిటిసిలు, సర్పంచులు ఉన్నప్పటికీ కొన్ని ప్రాంతాలలో సరైన అభివృద్ధి లేదు.

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కాలంలోనూ, రాష్ట్ర విభజన అనంతరం కూడా కడప జిల్లాకు సాగునీటి సమస్య పూర్తిస్థాయిలో పరిష్కారం కాలేదని లక్ష్మయ్య అన్నారు. ప్రస్తుతం పవన్ కళ్యాణ్ ప్రత్యేక శ్రద్ధతో వైఎస్సార్ కడప జిల్లాకు నీటి వసతులు కల్పించి కృషి చేసారు అని పేర్కొన్నారు. ప్రజల దాహం తీర్చేందుకు, రైతులకు సాగునీరు అందించేందుకు నీటి వనరుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వడం నిజమైన అభివృద్ధికి నిదర్శనమని అన్నారు.

“ప్రజలు కోరుకునేది ఇదే.. అభివృద్ధి కనిపించాలి, సమస్యలకు పరిష్కారం లభించాలి. రానున్న స్థానిక ఎన్నికల్లో ప్రజలు అభివృద్ధిని గమనించి జనసేనకు అవకాశం ఇస్తే గ్రామాల అభివృద్ధి ఎలా ఉంటుందో చూపిస్తాం” అని శీలంశెట్టి లక్ష్మయ్య అన్నారు.స్థానిక ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని జనసేన నాయకులు, కార్యకర్తలు ఇప్పటి నుంచే గ్రామస్థాయిలో ప్రజలకు అందుబాటులో ఉంటూ పార్టీని మరింత బలోపేతం చేయాలని ఆయన కోరారు.